జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 02 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 206 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు

- కెప్టెన్ స్మిత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు
- భారత పైలట్‌కు ఇజ్రాయెల్ ప్రధాని సెల్యూట్..
- హీరో అంటూ ముచ్చర్‌పై ట్రంప్ ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత

మిగతా 2లో..

## చెక్‌పవర్ పై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్ విషయంలో జరుగుతున్న ఘర్షణకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టేందుకు

మిగతా 2లో..

# రెండు డీఏలు మంజూరు

- ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త
- ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం
- ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఎల్‌నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ
- కరవు పరిస్థితులపై చర్యలకు సమాలోచనలు
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లపై పలు సూచనలు
- ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత
- డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ




**రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగుల్లో ఉన్న డీఏల్లో రెండు మంజూరు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బకాయిలను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరుకు నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా 2,500 కోట్ల రూపాయల భారం పడనుందని అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సుమారు నాలుగు గంటల పాటు క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.**

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛనుదారు లకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు , రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది.కేబినెట్ నిర్ణయాల ప్రకారం.. ఉద్యోగులకు 3.64 శాతం , 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో

మిగతా 2లో..

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు
# తాత్కాలిక బ్రేక్

- నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం
- ఖైరతాబాద్ ఉపఎన్నిక విజయారెడ్డి పిటిషన్
- నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆదేశించాలని వినతి




హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): హైకోర్టులో పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్ కు సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్ జడ్జి వద్ద పెండింగ్ లో

మిగతా 2లో..

## యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

- ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి
- సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం
- దిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత

మిగతా 12లో..

## సర్ ప్రక్రియ పొడిగింపు లేదు

- 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
- సర్‌లో ఈసీ కొన్ని మార్పులు చేసింది
- ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడి

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు

మిగతా 2లో..

## ఫారం-6లో మార్పులకు ఎవరు ఆదేశించారు?

- సర్ ప్రక్రియతో ప్రజాస్వామ్యం పూర్తిగా ధ్వంసం
- సీఈసీ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి
- మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ పై విచారణ జరపాలి
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్
- ఈసీపై మరోసారి రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షం
- నేటినుండి సర్‌పై ఇండియా కూటమి ఆందోళనలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): అసలు ఫామ్ 6లో మార్పులకు ఆదేశాలు ఎవరి నుంచి వెళ్లాయి, ఎవరు వీటిని ఆమోదించారు, ఇందులో సాఫ్ట్ వేర్ నిర్వహిస్తున్న టీసీఎస్ పాత్ర ఎంత అన్న అంశాలు కూడా తెరపైకి వస్తున్నాయి. వీటిపై ఇవాళ విపక్ష నేత రాహుల్ గాంధీ ఈసీతో పాటు టీసీఎస్ ను కూడా ప్రశ్నిస్తూ ఓ ట్వీట్ చేశారు. ఇందులో ఫామ్ 6లో చేసిన మార్పులకు ఎవరి నుంచి ఆదేశాలు వెళ్లాయి, వాటిని ఎవరు ఆమోదించారంటూ ప్రశ్నించారు. అలాగే టీసీఎస్ లో ఈ మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

మిగతా 12లో..

## ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది

- హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు..
- ఓట్లు పునరుద్ధరించకుంటే ఊరుకొనేది లేదు
- దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): సర్ లో భాగంగా ఖైరతాబాద్ లో తీసేసిన ఓట్లు తిరిగి పునరుద్ధరించకుంటే ఊరుకొనేది లేదని దానం హెచ్చరించారు. హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు.. తగలబడి పోతుందంటూ వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియలో భాగంగా తన నియోజకవర్గంలో

మిగతా 2లో..

## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు



హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళికలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

మిగతా 12లో..



# సంపాదకీయం

## జయహో స్మిత్ మచ్చార్!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగానే కో-పైలట్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన భారత సంతతి కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. రక్తమోడుతున్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి, పెను విమాన ప్రమాదాన్ని నివారించి 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా భావిస్తున్న కో పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. విమాన నియంత్రణ వ్యవస్థలను ధ్వంసం చేసి, విమానాన్ని కూల్చేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో విమానం కేవలం 30 సెకన్లలోనే దాదాపు 14,000 అడుగుల కిందికి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలపాలై కిందపడిపోతున్న సమయంలో కూడా కెప్టెన్ స్మిత్ చాకచక్యంగా కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేసి కేకలు వేశారు. విమానం తీవ్ర కుదుపులకు లోనవడం, అరుపులు వినిపించడంతో అప్రమత్తమైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. కాక్‌పిట్‌లోకి చొరబడిన ప్రయాణికులలో యానివ్ అనే ఇజ్రాయెల్ ప్లంబర్ ప్రధాన పాత్ర పోషించారు. టీవీలో ప్రసారమయ్యే ఎయిర్ డిజాస్టర్స్ కార్యక్రమాలు చూసి విమానాల నియంత్రణపై ప్రాథమిక అవగాహన పెంచుకున్నట్లు చెప్పిన యానివ్, ఇతర ప్రయాణికులతో కలిసి విధ్వంసానికి పాల్పడుతున్న కో-పైలట్‌ను కుర్చీ నుంచి వెనక్కి లాగి బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్లు, భద్రతా సిబ్బంది వెంటనే కాక్‌పిట్ నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుని విమానాన్ని అదుపు చేశారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దాదాపు 8 గంటల నిరీక్షణ అనంతరం ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు. గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్ కమర్షియల్ ఏవియేషన్ రంగంలో పదేళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన పైలట్. జూన్ 2011 నుండి 2022 వరకు దాదాపు 11 ఏళ్లపాటు భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2022లో డైరెక్ట్ ఎంట్రీ కెప్టెన్‌గా ఫ్లైదుబాయ్‌లో చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల్లో ఆయన నిపుణుడు. వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఆయన కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మచ్చర్‌కు కమర్షియల్ విమానయానంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు ఆయన 11 ఏళ్లకు పైగా స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2011 నుంచి జూన్ 2022 వరకు స్పైస్‌జెట్‌లో విధులు నిర్వహించిన ఆయన సీనియర్ కమాండర్‌గా, లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2020 నుంచి జూన్ 2022 వరకు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా ఇతర పైలట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. బోయింగ్ 737 విమానాలను 9,500 గంటలకు పైగా నడిపిన అనుభవం మచ్చర్‌కు ఉంది. జూన్ 2022 నుంచి ఫ్లైదుబాయ్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ దుబాయ్‌లో నివసిస్తున్నారు. అక్కడ కూడా పైలట్ల శిక్షణ, విమాన కార్యకలాపాల నిర్వహణలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విమానయాన భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే అనుభవం ఆయన కెరీర్‌లో భాగంగా ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ 30న జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని ప్రపంచ నేతలు కొనియాడారు. ఓవల్ ఆఫీస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. "స్మిత్ చాలా తీవ్రమైన గాయాలపాలైనా సమయస్ఫూర్తితో వ్యవహరించి రియల్ హీరోగా నిలిచారు. ఇదొక అద్భుతమైన సంఘటన" అని అన్నారు. తీవ్రంగా గాయపడినా వెనకడుగు వేయకుండా ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యానికి నా సెల్యూట్. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మిత్‌ను అత్యంత నైపుణ్యం కలిగిన వీరుడిగా అభివర్ణిస్తూ, భారత్-ఇజ్రాయెల్-యూఏఈ తరఫున ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు కాక్‌పిట్‌లో గొడవ జరుగుతున్న విషయం గుర్తించిన యానివ్.. వెంటనే అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరో ప్రయాణికుడితో కలిసి కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. చివరకు లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు సహకరించారు. ఈ ఘటనలో యానివ్ షర్టుపై రక్తపు మరకలు కనిపించాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్న తర్వాత యానివ్ హయూన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. ఈ సందర్భంగా నెతన్యాహు అతన్ని అభినందించారు. 'చాలా గొప్ప పని చేశావు. నువ్వు హీరో' అంటూ ప్రశంసించారు. ఆ తర్వాత విమానంలో జరిగిన పరిణామాలను యానివ్ ప్రధానితో పంచుకున్నారు. విమానంలో లైట్లు ఆగిపోవడం, క్యాబిన్ పరిస్థితుల్లో మార్పులు రావడం నుంచి కాక్‌పిట్‌లోకి వెళ్లే వరకు ఏం జరిగిందో వివరించారు. విమానం ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా లైట్లు ఆఫ్ అయ్యాయని ప్లంబర్ గా పనిచేస్తున్న హయూన్ తెలిపారు. అదే సమయంలో క్యాబిన్‌లోని గాలి పీడనంలో మార్పును గుర్తించడంతో విమానంలో ఏదో సమస్య తలెత్తిందని భావించి కాక్‌పిట్ వైపు వెళ్లాననీ చెప్పారు. తనతో పాటు మరో ప్రయాణికుడు కూడా అక్కడికి వచ్చాడని, అతను ఆ సమయంలో డ్యూటీ లేని ఓ పైలట్ అని తర్వాత తెలిసిందని హయూన్ చెప్పారు. కాక్‌పిట్ లోపల ఏదో ఘర్షణ జరుగుతున్నట్లు గుర్తించిన హయూన్, మరో ప్రయాణికుడు తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కెప్టెన్ స్మిత్ మచ్చర్ గాయపడి స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. అయినప్పటికీ కెప్టెన్ మచ్చర్ కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు. తలుపు తెరుచుకున్న వెంటనే తామిద్దరూ లోపలికి వెళ్లినట్లు వివరించారు. లోపలికి వెళ్లినప్పుడు ఒక పైలట్ నేలపై పడి ఉండగా.. మరో వ్యక్తి విమానం కంట్రోల్స్ దగ్గర ఉన్నట్లు హయూన్ తెలిపారు. అతడే దాడికి పాల్పడిన వ్యక్తిగా భావించి వెంటనే అతడిని కంట్రోల్స్ నుంచి దూరంగా తీసుకెళ్లారు. విమానం ఎత్తు కూడా తగ్గుతున్నట్లు ఆ సమయంలో తనకు అనిపించిందని వివరించారు. విమానం అదుపు తప్పే పరిస్థితి కనిపించడంతో హయూన్ వెంటనే కంట్రోల్ స్టిక్స్‌ను పట్టుకున్నారు. 'కంట్రోల్ స్టిక్స్‌ను నా చేతులతో పట్టుకుని వెనక్కి లాగాను. ఆ తర్వాత విమానం మళ్లీ సాధారణ ఎత్తుకు చేరుకుంటున్నట్లు అనిపించింది' అన్నారు. విమానం ఎలా అదుపులోకి తీసుకురావాలో తనకు ప్రత్యేక శిక్షణ లేకపోయినా.. గతంలో చూసిన టీవీ కార్యక్రమంలో విమాన ప్రమాదాల సమయంలో పైలట్లు ఎలా స్పందిస్తారో చూసిన విషయాలు గుర్తొచ్చాయని హయూన్ తెలిపారు. కాక్‌పిట్‌లో జరిగిన ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విమానంలో అసలు ఏం జరిగింది? ఈ ఘటనకు కారణమేంటి? అనే విషయాలపై పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా కెప్టెన్ స్మిత్ మచ్చర్ చేసిన సాహసాన్ని యావత్ ప్రపంచం కొనియాడుతుంది. నిజంగా కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు హాట్సాఫ్ చెప్పాల్సిందే.

# రెండు డీఏలు మంజూరు

మొదటిపేజీ తరువాయి..

కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు , పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జిపిఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది. డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూపరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది. గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి. ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని నియమించనున్నారు. కేంద్రాన్ని సాయం అడగాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరవు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని తెలంగాణ కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు దిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను రాష్ట్ర మంత్రివర్గం మంజూరు చేసింది. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీని మంత్రివర్గం ఆమోదించింది. వివిధ కేటగిరీల్లోని భూముల క్రమబద్ధీకరణ కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కరువు మండలాలు ప్రకటించడంతో పాటు.. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 15వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19 వేల 892 మెగావాట్ల డిమాండ్ కు చేరింది. ఈ నేపథ్యంలో డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఈ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినట్లు కేబినెట్‌లో చర్చించారు. తెలంగాణలో సాధారణంగా రోజువారీ విద్యుత్ వినియోగం సుమారు 15 వేల మెగావాట్ల వరకు ఉండగా.. ఈ సీజన్‌లో పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరింది. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 16,613 మెగావాట్లుగా ఉంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కేబినెట్ నిర్ణయించింది. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోటీ బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్నారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సుమారు 240 ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, వ్యయం, ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రభుత్వం సమీక్ష కొనసాగించనుంది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టును మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలను సమన్వయం చేసేందుకు నలుగురు గ్రూప్-1 అధికారులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా సంస్థలకు సంబంధించి ప్రత్యేక ప్రకటన విధానాన్ని తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విధానానికి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీ రూపొందించనున్నారు. ఈ విధానం ద్వారా డిజిటల్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రత్యేక మార్గదర్శకాలు ఏర్పడే అవకాశం ఉంది.

### ఖైరతాబాద్ ఉప ఎన్నికకు

# తాత్కాలిక బ్రేక్



మొదటిపేజీ తరువాయి..

ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది.

కాగా.. ప్రస్తుతం తెలంగాణలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో ఆ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయింది. ఈ క్రమంలో ఖైరతాబాద్ ఎలక్షన్ షెడ్యూల్ ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండా ఎన్నికల కమిషన్ కు ఆదేశాలు జారీ చేయాలంటూ దివంగత నేత పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై ఇంకా హైకోర్టు తుది తీర్పు వెల్లడించకముందే భారత ఎన్నికల సంఘం తెలంగాణ హైకోర్టుకు కీలక విషయాన్ని తెలిపింది. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్ కు సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్ జడ్జి వద్ద పెండింగ్ లో ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది. ఇక దానం నాగేందర్ అనర్హతకు గురికావడంతో ప్రస్తుతం ఖైరతాబాద్ స్థానం ఖాళీగానే ఉంది. ఇదిలాఉంటే దిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట దానం నాగేందర్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని ఆయన ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తే మరోసారి ఓడిపోవడం తథ్యమంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఖైరతాబాద్ టికెట్ సీపీ వేణుగోపాల్ స్వామికి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# సర్ ప్రక్రియ పొడిగింపు లేదు

మొదటిపేజీ తరువాయి..

బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.



# ఎర్రవల్లి భూ సర్వే నివేదిక సిద్ధం

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు.

# ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది

మొదటిపేజీ తరువాయి..

20 వేల ఓట్లను తొలిగించారని దానం చెప్పారు. ఎస్ఐఆర్ గురించి రాహుల్ గాంధీ పదే పదే ఎందుకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. ఇప్పుడు మా నియోజకవర్గంలో ప్రత్యేకించి 20 వేల ఓట్లు ఇప్పటివరకు కట్ చేశారని చెప్పుకొచ్చారు. వారికి నోటీసులు ఇచ్చారని.. దాన్ని సరిచేయాలని డిమాండ్ చేసారు. ఇందులో చాలా మంది బీజేపీతో అనుబంధంగా.. ఎవరైతే ఏఎంసీలున్నరో.. ఏఆర్‌వోలున్నరో బీజేపీతో కుమ్మక్కై పెద్ద ఎత్తున ఓట్లు తొలగించే ప్రక్రియ చేపడుతున్నారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నానని... ఎవరైతే మా ఓట్లు తీయించే ప్రయత్నం జరుగుతున్నదో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఓటు చోరీ నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత తమ పై ఉందన్నారు. ఇప్పటిదాకా డిలీట్ చేసిన ఓట్లను మళ్లీ పరిగణలోకి తీసుకొని అందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేసారు. కాగా.. ఉప ఎన్నిక ప్రక్రియ ప్రారంభం వేళ దానం చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కాగా దానం పై న్యాయస్థానం అనర్హత వేటు తో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయమైంది. ఇప్పటికే ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. త్వరలో ఎన్నికల సంఘం ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించనుంది. కాగా.. ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ మహిళా నేత విజయా రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్ సంచలనంగా మారిందది. ఇక.. ఇటు దానం నాగేందర్ సర్ ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్ లో తొలిగించిన ఓట్ల పైన దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఖైరతాబాద్ ఉప ఎన్నిక చుట్టూ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయం నడుస్తోంది. ఇప్పటికే ఉప ఎన్నిక ఖాయం కావటంతో కాంగ్రెస్ నుంచి తిరిగి దానం నాగేందర్ పోటీ చేస్తారని చెబుతున్నారు. అదే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఇటు ఎన్నికల సంఘం త్వరలోనే ఈ ఉప ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా.. ఈ ఎన్నిక పైన అభ్యర్థిత్వం పైన కాంగ్రెస్ నుంచి విజయారెడ్డి- దానం మధ్య పోటీ నెలకొంది. విజయా రెడ్డి తాజాగా ఈ ఉప ఎన్నిక పైన హైకోర్టను ఆశ్రయించారు. కాగా.. ఇటు దానం చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.



# చెక్‌పవర్ పై ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కావడం.. ఇలా జరగడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పడుతున్న పరిస్థితిని నివారించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీఓ) ప్రభుత్వం స్పష్టమైన సూచనలు చేసింది. కొత్త ఆదేశాల ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్ సంతకం చేయాల్సి ఉంటే.. కారణం లేకుండా వాటిని పెండింగ్‌లో పెట్టకూడదని తెలిపింది. తగిన కారణం లేకుండా ఏడు రోజులకు మించి సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత జిల్లా కలెక్టర్ దానిపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులపై సంతకం చేయకుండా బిల్లుల చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేవలం వ్యక్తిగత విభేదాలు, ఇతర కారణాలతో పంచాయతీ నిధుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చెక్కులపై సంతకం విషయంలో అనవసర జాప్యం కొనసాగి.. పంచాయతీ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇలాంటి సందర్భాల్లో ఉప సర్పంచ్‌కు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి.. ఆయన స్థానంలో అధికారుల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ లేదా ఎంపీడీవోలో ఒకరికి ఉప సర్పంచ్ స్థానంలో జాయింట్ చెక్ పవర్ ఇచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా చెక్కుల చెల్లింపులు ఆగిపోకుండా పంచాయతీ నిధుల వినియోగం కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడం కీలకం. అయితే కొన్ని చోట్ల సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తుతున్న విభేదాలు చెక్కులపై సంతకాల విషయంలో సమస్యలకు దారితీస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఉప సర్పంచ్‌కు తన అభ్యంతరాలను తెలియజేసే అవకాశం ఉండేలా.. మరోవైపు కారణం లేకుండా సంతకాలు నిలిపివేసి పంచాయతీ కార్యకలాపాలను స్తంభింపజేయకుండా చర్యలు తీసుకునేలా నిబంధనలను స్పష్టం చేశారు. తాజా ఆదేశాలతో ఇకపై చెక్కులపై సంతకాల విషయంలో తలెత్తే వివాదాలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు రోజులకు మించి కారణం లేకుండా చెక్కులు పెండింగ్‌లో ఉంటే విచారణ చేపట్టి.. ఉద్దేశపూర్వక జాప్యం జరిగిందా లేదా అన్నది తేల్చాల్సి ఉంటుంది. విచారణ తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ అధికారికి జాయింట్ చెక్ పవర్ అప్పగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు.. చెక్ పవర్ విషయంలో తలెత్తుతున్న వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు

మొదటిపేజీ తరువాయి..

పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు. మరోవైపు దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ వెళ్తున్న విమానం హైజాక్‌కు గురి కాకుండా కాపాడిన భారత పైలట్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత పైలట్ స్మిత్ ముచ్చర్‌కు సెల్యూట్ అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సెప్టెంబర్ 11 తరహా డిజాస్టర్‌ను ఆయన తప్పించాడని కొనియాడారు. "అసాధారణ ధైర్య సాహసాలు కనబర్చిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ ముచ్చర్‌కు నా సెల్యూట్. కత్తిపోటుకు గురైనా, తీవ్ర గాయాలైనా.. అతడు తిరిగి పోరాడాడు,

## తండ్రి నేర్పిన మంచితనం.. కొడుకు చేతుల్లో మానవత్వంగా మారింది!



**మామడ అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి) :** తండ్రి చూపిన సేవా మార్గంలో నడుస్తూ, ఆయన నేర్పిన మానవత్వాన్ని ఆచరణలో చూపించాడు నిర్మల్‌కు చెందిన సాయి సిద్ధార్థ. గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ (జి యం సి), ఆసిఫాబాద్‌లో ఎంబిబిఎస్ చదువుతున్న సాయి సిద్ధార్థ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.

తన తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించడంతో పాటు సమాజ సేవలోనూ ముందుంటూ, నలుగురికి ఉపయోగపడాలనే ఆలోచనతో జీవిస్తున్నారని సాయి సిద్ధార్థ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే తండ్రి సేవా భావాన్ని, మంచితనాన్ని చూస్తూ పెరిగిన తనకు అదే స్ఫూర్తిగా మారిందన్నారు.

తండ్రి తన జీవితంతో నేర్పిన సేవా పాఠాన్ని.. కొడుకు తన రక్తంతో రాశాడు అన్నట్లుగా, అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం తన బాధ్యతగా భావించినట్లు తెలిపారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిగా సమాజానికి తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో స్వచ్ఛంద రక్తదానం చేసిన సాయి సిద్ధార్థను పలువురు అభినందించారు. తండ్రి చూపిన దారిలో కొడుకు నడవడం కంటే తండ్రికి దక్కే గొప్ప గౌరవం మరొకటి ఉండదని, కుటుంబం నుంచి నేర్చుకున్న విలువలు సమాజానికి ఉపయోగపడినప్పుడే వాటి అసలు విలువ తెలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

## గిరిజన డిగ్రీ కళాశాలలో ఏక్ గంట-ఏక్ సాత్‌తో స్వచ్ఛత







**అదిలాబాద్ టౌన్, అక్టోబర్ 1, (ప్రజాజ్యోతి) :** మాస్ స్వచ్ఛత క్యాంపెయిన్‌లో భాగంగా ఏక్ గంట – ఏక్ సాత్ కార్యక్రమాన్ని గిరిజన డిగ్రీ విద్యార్థులు, ఎన్ సిసి క్యాడేట్స్ గురువారం ఘనం గా నిర్వహించారు. 32(టి) బెటాలియన్ ఎన్ సీసీ, కళా శాల ఎన్ సిసి ఏఎన్ఓ లె ఫ్టినెంట్ పుట్టా లక్ష్మణ్ ఆధ్వ ర్యంలో ఐ లవ్ ఆదిలాబాద్ పాయింట్, కలెక్టర్ క్యాంపు, ఏరోడ్రమ్ పరిసర ప్రాంతాలను ఎన్‌సిసి క్యాడేట్స్ విద్యార్థులు శుభ్రం చేశారు. స్వచ్ఛతే సేవ,స్వచ్ఛభారత్ మనందరి బాధ్యత అనే సం దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పరి సరాల పరిశుభ్రతపై చైతన్యం పెంపొందించారు.

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం

### అత్యవసర వేళల్లో రక్తమే ప్రాణరక్ష



**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఏ ప్రాణం పోకూడదని, సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సీడం నాగేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా ఉన్న యువత పెద్దఎత్తున స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్యంలో రక్తం కొరతను అధిగమించేందుకు రక్తదాన శిబిరాలు కీలకమన్నారు. ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొంటూ, మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అనంతరం రక్తదానం చేసిన దాతలను సుగుణక్క అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఆర్గనైజర్ ఆడ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కందకాల తవ్వకాలతో మురిమడుగు నిరుపేదల ఆందోళన



**జన్నారం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు సత్యసాయి నగర్‌లో అటవీశాఖ అధికారుల చర్యలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాలనీలోని పలు ఇళ్లు, భూముల చుట్టూ అధికారులు జేసీబీలతో కందకాలు తవ్వడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాలనీవాసులు సుద్ధల పోశం, కుటికెల విజయ, పుదూరి లింగవ్వ తదితరులు వ మాట్లాడుతూ.. "గత 40 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి ఇళ్ల పక్కనే పెద్ద కందకాలు తవ్వడంతో రాకపోకలకు వీలులేకుండా పోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ఖాళీ చేసే ప్రసక్తే లేదని, ఒకవేళ ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి కల్పిస్తే రోడ్డుపైనే టెంట్లు వేసుకుని నిరసన తెలుపుతామని హెచ్చరించారు.సమాచారం అందుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు అటవీశాఖ అధికారులు అన్యాయం చేస్తే సహించేది లేదని, బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎస్ఐ గుర్రం ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అటవీశాఖ అధికారులతో పాటు కాలనీవాసులతో మాట్లాడి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

## శ్రీ విళ్లి పుత్తూరు పీఠాధిపతులు శఠ కోప ముని శ్రీ రామానుజ జీయర్ స్వామి పర్యటన

– 3న ఖానాపూర్‌లో బస – లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో అనుగ్రహ భాషణం



**ఖానాపూర్ అక్టోబర్ 1(ప్రజా జ్యోతి) :** మనసా భక్తి కర్మణా శ్రద్ధ వాచా సత్యం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో తమిళనాడు శ్రీ షఠకోప సిద్ధాంత పీఠం శ్రీ విల్లిపుత్తూరు స్వామి మానవాల మాముని సన్నిధి 23వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శఠ కోప రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులతో వారి ఉత్తరాధికారి రామానుజ జీయర్ స్వామి మూడు రోజులపాటు పర్యటించనున్నట్లు భక్తాగ్రేసరులు తిరుమల మానస వేణు శని శనగల్ సంపత్ కుమార్ ఆచార్యులు ప్రకటనలో తెలిపారు అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 4 వరకు నిజామాబాద్, నిర్మల్ జగిత్యాల,జిల్లాలోని దేవాలయాల ఆధ్యాత్మిక ప్రాంతాల్లో సాంప్రదాయ పెద్దలకు సత్కారం మంగళ శాసనం వివిధ ఆలయముల సందర్శన నిమిత్తం వి చేస్తున్నట్లు తెలిపారు భక్తులు ఆయా ప్రాంతాల్లో జీయర్ స్వామి దర్శించుకుని ఆయన మంగళ శాసనములు పొంది వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో భగవత్ భగవతాచార్య సన్నిధి సేవ చేసుకోవాలని కోరారు మూడు జిల్లాల ఆలయ సందర్శన సందర్భంగా అర్చకులకు సన్మానం తో పాటు భక్తులకు ప్రవచనాలు మంగళ శాసనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 3న ఖానాపూర్ దేవాలయ సందర్శనలి నిర్మల్ జిల్లా కడం మండల కేంద్రంలోని కడం ప్రాజెక్టు డ్యాం సైట్ సందర్శన అనుగ్రహ భాషణం అనంతరం సాయంత్రం 6గంటలకు ఖానాపూర్ పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో సందర్శించి భక్తులతో భక్తి ప్రవచనాలు మంగళ శాసనాల అనంతరం వేద పండితులు సిద్ధాంతకర్త 500 దేవాలయాల ప్రతిష్టాపన ఆచార్యులు చక్రపాణి వాసుదేవ చార్యులకు భాగవత సత్కారం( ఘన సన్మానం జీయర్ స్వామి చే )గోష్టి అనుగ్రహ భాషణం రాత్రి వాసుదేవా చారి ఆలయ అర్చకులు చక్రపాణి నరసింహమూర్తి గృహంలోనే బస చేస్తారు ఈ మేరకు ఖానాపూర్ పట్టణంలోని భక్తులు శ్రేయోభిలాషులు రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్య బృందాలు పాల్గొని తమిళనాడు శ్రీ వెల్లిపుత్తూర్ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శఠ కోపముని రామానుజ స్వామి కృపకు పాత్రులు అవ్వాలని ఖానాపూర్ లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అడ్లగట్ల రాజన్న నిమ్మల రమేష్ ఖానాపూర్ డివిజన్ చాత్తాద శ్రీ వైష్ణవ అధ్యక్ష కార్యదర్శులు మంత్రరాజం దేవేందర్ ఆసూరి సంతోష్ కుమార్లు కోరుతున్నారు.

## పీచర పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ





**నేరడిగొండ అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** స్థానిక పీచర గ్రామంలోని టి డబ్ల్యూ పి ఎస్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫాంలు మరియు బెల్టుల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీచర గ్రామ సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు సొంతంగా యూనిఫాంలు మరియు బెల్టులను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పురప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారమే తొలి ముద్ద

### అంగన్వాడీల్లో సమతుల్య ఆహారం అందించాలి : కలెక్టర్ కె.హరిత





**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3–6 ఏళ్ల పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం జనకాపూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన 'తొలిముద్దు' అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, మున్సిపల్ చైర్‌పర్సన్ మెంగ్రే ఆకాష్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పిల్లలకు ఉప్మా, కిచిడీతో కూడిన అల్పాహారాన్ని అందించారు. తల్లులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం జనకాపూర్ రైతు వేదికలో పోషణ మాసంలో భాగంగా నిర్వహించిన గర్భిణుల శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మహిళలు, గర్భిణుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని, అంగన్వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, చిన్నారుల ప్రారంభ విద్యపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, కౌన్సిలర్ కొండు భారతి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఉధవల రైతు ప్రొడ్యూసర్ కంపెనీకి నూతన కమిటీ

### రైతు సంక్షేమమే లక్ష్యంగా కొత్త పాలకవర్గం



**ఆసిఫాబాద్ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా సేవలందిస్తున్న ఉధవల రైతు ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నూతన పాలకవర్గాన్ని సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అట్లూరి పూర్ణ గురువారం వెల్లడించారు. సంస్థ చైర్మన్‌గా కాసర్ల గోపాల్, సెక్రటరీగా కావల్కర్ యాదవ్, ప్రధాన కోశాధికారిగా ఆత్రం నాయకు బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్లుగా అజ్మీరా ప్రేమ్‌చంద్, ప్రకాష్, లక్ష్మయ్య, పున్నందాస్, తిరుపతి, మనకు, పగ్గుబాయి ఎంపికయ్యారు. సీఈఓగా భుక్య పవిందర్, అకౌంటెంట్‌గా కావల్కర్ నితిన్ బాధ్యతలు స్వీకరించారు. ఆడ దస్నాపూర్ సర్పంచ్ విజేస్‌కు కూడా కీలక బాధ్యతలు అప్పగించినట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## మురిమడుగు గ్రామస్తులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి

### జాన్సన్ నాయక్





**జన్నారం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామంలో అటవీశాఖ ట్రెంచ్ హద్దుల వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అండగా నిలిచారు. గురు వారం మురిమడుగు గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత గ్రామస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటూ తమ జీవనాధారమైన భూముల్లో సాగు చేసుకుంటున్న పేద రైతు కుటుంబాలకు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమిలోకి ప్రవేశం లేదంటూ జేసీబీలతో ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి హద్దులు నిర్ణయించే చర్యలపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జి జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... పేదల జీవనాధారమైన భూముల విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవడం సరికాదని, ఏళ్లుగా అక్కడే నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశారు.గ్రామస్తుల హక్కులు, వారి జీవనాధారం కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, మురిమడుగు గ్రామస్తుల సమస్య పరిష్కారం అయ్యే వరకు వారి తరఫున చట్టబద్ధంగా పోరాడుతామని జాన్సన్ నాయక్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్,ఫజల్ ఖాన్,అభిలాశ్, దేవన్న,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌కు ఎంపికైన ఇంధన్ పెల్లి విద్యార్థులు



**జన్నారం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** అదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన (నాలుగు జిల్లాల) జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీలలో జన్నారం మండలంలోని జిల్లా పరిషత్ ఇంధన్ పల్లి పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ రాజేందర్, పిడి శివనూరి తిరుపతి లు తెలిపారు. అండర్ 17 విభాగంలో పదవ తరగతికి చెందిన స్వామి, దివ్య, 9 వ తరగతికి చెందిన ప్రతిమ, అండర్ 14 విభాగంలో 9వ తరగతికి చెందిన రిషిత, ఎనిమిదవ తరగతికి చెందిన అయాన్‌లు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరితోపాటు ఐదుగురు ద్వితీయ స్థానం ముగ్గురు తృతీయ స్థానంతో మొత్తం 13 పథకాలు సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, చైర్మన్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు గ్రామస్తులు అభినందించారు.

## భూమా చారి దీక్షకు మద్దతు తెలిపిన ట్రాక్టర్ డ్రైవర్ అసోసియేషన్



**జన్నారం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దుచేసి, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాముల భూమా చారి చేస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. 40 వరోజు ఆయన దీక్షకు మద్దతుగా రామాంజనేయ ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ కామనపల్లి, దేవునిగూడ, చర్లపల్లికి చెందినవారు మద్దతు తెలిపి ఆయనతోపాటు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్రె మధుకర్ మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఎత్తివేసి, ఏకో సెన్సిటివ్ జోన్ రద్దు చేయాలని భూమచారి చేస్తున్న దీక్షకు రోజురోజుకీ మద్దతు పెరుగుతుందని, అధికారులు స్పందించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిదర్ల రాజు, రాకేష్, శాంతి, నరేష్, క్రాంతి, దేవుసింగ్, వెంకటేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## చింతగూడ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక



**జన్నారం, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలంలోని చింతగూడ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని గురువారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఆరె సత్యం, ఉపాధ్యక్షులుగా బీర్పూరి మల్లేష్, చిరినేని సురేష్, ప్రధాన కార్యదర్శిగా కందుల రాజు, కోశాధికారిగా ఆరే లింగమూర్తి, అకౌంటెంట్‌గా పురం శెట్టి సతీష్, కార్యదర్శి గా ఇమ్మిడిశెట్టి సత్తన్న, ప్రచార కార్యదర్శిగా పానుగంటి ప్రవీణ్, స్పీకర్ గా ఆరే యుగంధర్, సోషల్ మీడియా నిర్వాహకుడిగా కస్తూరి దుబ్బయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆరే సత్యం తో పాటు కార్యవర్గాన్ని సర్పంచ్ సుతారి సుమలత వినయ్ లు అభినందించారు.

## ఇంటిపై సౌర విద్యుత్.. బిల్లుకు చెక్!

– పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ పొదుపు

– ప్రజలకు అవగాహన కల్పించిన కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** గృహ వినియోగదారులు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలో సేవాసేతు అభియాన్‌లో భాగంగా పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఆపరేషన్ ఉత్తమ్ జాడేతో కలిసి పథకానికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా సొంతంగా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వినియోగంతో సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటం తగ్గుతుందన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు విద్యుత్ బిల్లు, బ్యాంకు ఖాతా వివరాలు ప్రధానంగా అవసరమని పేర్కొన్నారు. అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం, విద్యుత్ శాఖ అధికారులు, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు అధికారులు, సోలార్ వెండర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్

**- ఎమ్మెల్సీ పోరులో సత్తా చాటాలి**

**- ప్రభుత్వానికి చెంప చెల్లుమనిపించాలి: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**





**వనపర్తి, అక్టోబరు 1 (ప్రజాజ్యోతి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్ వంటివని, ఎమ్మెల్సీ పోరులో సత్తా చాటాలనీ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు హైదరాబాద్, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం వనపర్తిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్ వంటివని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో వారిలో అసంతృప్తి నెలకొందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు నెలరోజుల పాటు ప్రత్యేక దృష్టి సారించి పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. గ్రాడ్యుయేట్లు తాజా ఓటు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ శ్రేణులు గ్రామాల వారీగా పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు. 43 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అభ్యర్థి విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వానికి ప్రజల అసంతృప్తిని తెలియజేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కారంలో మార్గదర్శకాలు పాటించాలి

**- ఓటర్లను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు.. ఇంటివద్దే పత్రాల సేకరణ**

**- పేదలు, వలస కూలీలు, నిరాశ్రయులకు ప్రత్యేక సహాయం అందించాలి**

**: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు**



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి బ్యూరో) :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ--2026లో భాగంగా జారీ చేసిన నోటీసుల పరిష్కారంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

గురువారం ఆయన రాష్ట్రంలోని జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

**ఓటర్లు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదు :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నోటీసులు జారీ అయిన, ఓటర్ల జాబితాలో వివరాలు సరిపోలని లేదా గుర్తింపు వివరాల్లో తేడాలు ఉన్న ఓటర్లు విచారణ కోసం తప్పనిసరిగా ఓటరు నమోదు అధికారి లేదా సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.

సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి, ఎన్నికల సంఘం నెట్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం నిబంధనల మేరకు ఓటరు నమోదు అధికారి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఓటరు నమోదు అధికారి నిర్ణయం మేరకు ఆన్‌లైన్ ద్వారా విచారణ నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అవసరమైతే కుటుంబంలోని ఏదైనా వయోజన సభ్యుడు సంబంధిత ఓటరు తరఫున విచారణకు హాజరయ్యే అవకాశం కల్పించాలని సూచించారు.

**పేదలు, వలస కూలీలకు ప్రత్యేక సహాయం :** ఎస్ఐఆర్ ప్రక్రియలో పేదలు, వలస కూలీలు, నిరాశ్రయులు, రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అవసరాన్ని బట్టి సహాయ కేంద్రాలు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ఏ ఓటరూ కేవలం అవగాహన లేదా పత్రాల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని స్పష్టం చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకోవాలి :** ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఫారం--6కు జత చేసిన ప్రకటనను గౌరవ సుప్రీంకోర్టు సమర్థించిన విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియకు కాకుండా సాధారణ ఓటర్ల నమోదు ప్రక్రియలో 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం వర్తించే సంబంధిత దరఖాస్తు పత్రాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు.

**ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నోటీసుల పరిష్కారాన్ని సులభతరం చేయడంతో పాటు, ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించాలని సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, సాధ్యమైనంత వరకు వారి ఇళ్ల వద్దే అవసరమైన పత్రాలను సేకరించి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా, ప్రజలకు అనుకూలంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## పట్టభద్రులు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి

**- ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం -- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**



**వనపర్తి, అక్టోబరు 1 (ప్రజాజ్యోతి):** గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి ఆర్డీవో సుబ్రమణ్యానికి ఆయన దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. క్వాలిఫైయింగ్ తేదీకి కనీసం మూడేళ్ల ముందు డిగ్రీ లేదా సమాన అర్హత పొందిన పట్టభద్రులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు అర్హులు. అర్హులైన వారు ఫారం--18 ద్వారా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, నాగన్న యాదవ్, గౌడ్ నాయక్, స్టార్ రహీం, సయ్యద్ జమీల్, మంద రాము తదితరులు ఉన్నారు.

# మార్కెట్ కదిలేనా..? సంత తరలేనా!

**- పాతకోట కందకం మార్కెట్ వినియోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్ కార్యాచరణ**

**- వారాంతపు సంతను ఇక్కడే నిర్వహించాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి**





**వనపర్తి, అక్టోబరు 1 (ప్రజాజ్యోతి):** వనపర్తి పట్టణంలోని గాంధీచౌక్ పాతకోట వద్ద నిరుపయోగంగా ఉన్న కందకం కూరగాయల మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. మార్కెట్ నిర్మించినా వినియోగంలోకి రాకపోవడంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. మార్కెట్‌లోని వసతులు, పరిసరాల పరిశుభ్రత, వినియోగంలోకి రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మార్కెట్ మొత్తాన్ని శుభ్రం చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరమైన కనీస వసతులు కల్పించాలని సూచించారు. పట్టణంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వారాంతపు సంతను కందకం మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంతను తరలించిన అనంతరం పెండింగ్ పనులను పూర్తిచేసి వ్యాపారులు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మార్కెట్‌ను ప్రజలకు ఉపయోగపడేలా సద్వినియోగంలోకి తీసుకురావడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ నిరంజన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి రూ.3.15 కోట్లు





**- వనపర్తి నియోజకవర్గంలో 15 పనులకు నిధులు మంజూరు**

**- అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ గదుల నిర్మాణం: ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి, అక్టోబరు 1 (ప్రజాజ్యోతి):** నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.3.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చొరవతో సమర్పించిన ప్రతిపాదనల మేరకు మొత్తం 15 అభివృద్ధి పనులకు రూ.3 కోట్ల 15 లక్షల 16 వేల నిధులు కేటాయించారు. అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ గదుల నిర్మాణంతో పాటు పాఠశాలల మరమ్మతులు చేపట్టనున్నారు. పెబ్బేరు మండలం చెలిమిల్ల ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల మిగిలిన నిర్మాణ పనులకు రూ.15 లక్షలు, పెబ్బేరు భవిత కేంద్రంలో యాక్టివిటీ రూముల నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.23.80 లక్షలు మంజూరయ్యాయి. వనపర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు కేటాయించారు.

యెదుల ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.23.80 లక్షలు మంజూరయ్యాయి. గోపాల్‌పేట కస్తూర్బా విద్యాలయంలో కంప్యూటర్ గదికి రూ.25 లక్షలు, సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, ఘనపూర్ కస్తూర్బా విద్యాలయంలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు కేటాయించారు. రేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు, రేవల్లి కస్తూర్బా విద్యాలయంలో సైన్స్ ల్యాబ్‌కు రూ.26 లక్షలు మంజూరయ్యాయి. రేవల్లి మండలం కేశంపేట ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు రూ.4.56 లక్షలు, ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరమ్మతులకు రూ.15 లక్షలు, ఘనపూర్ మండలం సోలిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరమ్మతులకు రూ.18 లక్షలు కేటాయించారు.

**ఆధునిక విద్యకు ప్రాధాన్యం :** ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. అంగన్‌వాడి, పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యా వ్యవస్థలో మార్పులకు చర్యలు చేపడుతోంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఒకే ప్రాంగణంలో విద్యాబోధన, వసతి, సైన్స్, కంప్యూటర్, ఏఐ, స్కిల్ ల్యాబ్‌లు, క్రీడా సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలోనూ ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా వనపర్తి మండలం వెల్టూరులో రూ.11.75 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రంలోని ఉపాధ్యాయులను ఫిన్లాండ్, జర్మనీ తదితర దేశాలకు పంపించి అక్కడి బోధనా పద్ధతులు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఆధునిక విద్యా విధానాలను అధ్యయనం చేయిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడంపై ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టి సారించారు.

# మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకోండి

**- కక్షిదారులు, బాధితులకు తక్కువ ఖర్చుతో.. తక్కువ సమయంలో వివాదాల పరిష్కారం**

**- అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 30 వరకు జాతీయ ప్రత్యేక మధ్యవర్తిత్వ డ్రైవ్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత**




**మహబూబ్‌నగర్, అక్టోబర్ 01(ప్రజా జ్యోతి బ్యూరో) :** వివాదాలను సుదీర్ఘకాలం న్యాయస్థానాల్లో కొనసాగించకుండా, పరస్పర అంగీకారంతో తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వాన్ని కక్షిదారులు, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత సూచించారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె జాతీయ ప్రత్యేక మధ్యవర్తిత్వ డ్రైవ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివాదాల సత్వర పరిష్కారమే లక్ష్యంగా మధ్యవర్తిత్వ చట్టం--2023 ప్రకారం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 30 వరకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మధ్యవర్తిత్వ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల కోర్టుల పరిధిలోని వివాదాలను మధ్యవర్తిత్వం, రాజీ ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేక న్యాయవాదుల బృందాలను (మధ్యవర్తులు) ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహబూబ్‌నగర్, దేవరకద్రకు సంబంధించిన కేసులకు జిల్లా న్యాయ సేవా సమితి ఆవరణలో, జిల్లా కోర్టులో, అలాగే జడ్చర్ల పరిధిలోని కోర్టు ఆవరణలో ప్రత్యేక మధ్యవర్తిత్వ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**ఏ కేసులకు అవకాశం..? :** ప్రత్యేక మధ్యవర్తిత్వ డ్రైవ్ ద్వారా సివిల్ కేసులు, వాణిజ్య (కమర్షియల్) వివాదాలు, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన వివాదాలను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని న్యాయమూర్తి తెలిపారు.

మధ్యవర్తిత్వ ప్రక్రియలో ఇరుపక్షాల సమ్మతి ప్రధానమని, ఎవరికీ బలవంతం లేకుండా తమకు అనుకూలమైన పరిష్కార మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**కోర్టు బయటే రాజీ.. సమయం, ఖర్చు ఆదా! :** సుదీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇరుపక్షాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మధ్యవర్తుల సహకారంతో వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా లభిస్తుందని తెలిపారు. న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అనేక వివాదాలకు సత్వర పరిష్కారం లభించేలా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె కక్షిదారులకు సూచించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మధ్యవర్తుల బృందాలు ఇరువర్గాలతో చర్చించి, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి తీసుకురావడానికి కృషి చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్‌లో 'మేఘా' మార్క్!

**- పేదింటి పెద్దదిక్కు.. 'మేఘా' భరోసా**

**- 34 నెలల్లో రూ.20 కోట్ల మేర సాయం.. 7,872 మంది లబ్ధిదారులు**

**- ఎల్ఓసీ ద్వారా మరో 469 మందికి రూ.9.18 కోట్ల వైద్యసాయం**






**వనపర్తి, అక్టోబరు 1 ((ప్రజాజ్యోతి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ద్వారా పేద కుటుంబాలకు వైద్యసాయం అందించడంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబా లకు ప్రభుత్వ సాయం సకాలంలో అందేలా ఎమ్మెల్యే కార్యాలయం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి దరఖాస్తు నుంచి సాయం మంజూరయ్యే వరకు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. 2026 అక్టోబర్ 2 నాటికి వనపర్తి నియోజకవ ర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా 7,872 మంది లబ్ధిదారులకు రూ.19,98, 40, 700 మేర ఆర్థికసాయం అందినట్లు వెల్లడించింది. అదేవిధంగా అత్యవసర, ఖరీదైన వైద్యం అవసరమైన వారికి ఎల్ఓసీ ద్వారా 469 మందికి రూ.9,18,50,000 విలువైన వైద్యసాయం అందించినట్లు పేర్కొంది. వనపర్తి--హైదరాబాద్‌లో ప్రత్యేక సిబ్బంది సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వనపర్తి, హైదరాబాద్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాల సమీకరణ, సంబంధిత అధికారులతో సమన్వయం, తదుపరి చర్యలను సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. ప్రతి నెలా సీఎంఆర్ఎఫ్ కోసం సుమారు 1,200 నుంచి 1,500 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించేందుకు సహకరిస్తున్నట్లు తెలిపింది. అత్యవసర వైద్య అవసరాలకు సంబంధించి నెలకు సుమారు 15 నుంచి 20 ఎల్ఓసీ కేసుల పరిష్కారానికి సహకరిస్తున్నట్లు పేర్కొంది.

**పార్టీలకతీతంగా..** అర్హత ఉన్న పేద కుటుంబాలకు పార్టీలకతీతంగా ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. లబ్ధిదారులకు కనీసం రూ.10 వేల నుంచి అవసరాన్ని బట్టి రూ.5--6 లక్షల వరకు ఆర్థికసాయం అందుతున్నట్లు పేర్కొంది. అనారోగ్యంతో కుటుంబాలు అప్పులపాలు కాకుండా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం దూరం కాకుండా ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాన్ని సకాలంలో అందించడమే లక్ష్యంగా ఈ వ్యవస్థను కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది.

## వృద్ధురాలికి అండగా అదనపు కలెక్టర్

**- చెట్టు కింద జీవనం సాగిస్తున్న అనంతమ్మ పరిస్థితిపై ప్రత్యక్ష పరిశీలన**

**- కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకునేలా నోటరీ హామీ పత్రం తీసుకోవాలని ఆదేశం**

**- సురక్షిత ఆశ్రయం, వైద్యం, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు**



**మహబూబ్‌నగర్ అక్టోబర్ 01 (ప్రజా జ్యోతి బ్యూరో) :** చెట్టు కిందే జీవనం సాగిస్తున్న 63 ఏళ్ల కురువ అనంతమ్మ పరిస్థితిపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకున్న అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ స్పందించారు. బండమీదిపల్లికి వెళ్లి వృద్ధురాలిని స్వయంగా కలిసి ఆమె పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతమ్మ ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, భూమి, ఆస్తులకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెకు ప్రస్తుతం అందుతున్న వైద్యం, సంరక్షణ, రోజువారీ అవసరాలు ఎలా తీరుతున్నాయన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**కుటుంబ సభ్యులు బాధ్యత వహించాలి :** వృద్ధురాలి సంరక్షణ విషయంలో కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి నోటరీ చేయించిన హామీ పత్రం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆహారం, వైద్యం, భద్రత, రోజువారీ అవసరాల విషయంలో ఆమెను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు తగిన బాధ్యత వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుటుంబ సభ్యులు హామీ ఇచ్చినప్పటికీ అనంతమ్మను సంరక్షించకుండా నిర్లక్ష్యం చేస్తే, వర్తించే నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే వృద్ధురాలి సంరక్షణ కోసం తగిన సంస్థ లేదా ట్రస్ట్ ద్వారా కేర్‌టేకర్లను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. **ఇకపై ఆరుబయట జీవించకుండా చూడాలి :** అనంతమ్మ ఇకపై చెట్టు కింద లేదా ఆరుబయట జీవించాల్సిన పరిస్థితి లేకుండా సురక్షితమైన ఆశ్రయం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆమె ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించడంతో పాటు నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వృద్ధాప్య పింఛన్, రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆమె అర్హతను పరిశీలించి, అర్హత మేరకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక, సామాజిక సహాయం విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**కలెక్టర్‌కు సమగ్ర నివేదిక :** అనంతమ్మ కుటుంబ పరిస్థితి, ఆరోగ్యం, భూమి, ఆస్తుల వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత, కుటుంబ సభ్యుల నుంచి తీసుకున్న హామీ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించి వివరమైన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం ఆధారంగా స్పందించి వృద్ధురాలి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతమ్మకు ఇకపై నిరంతర సంరక్షణ, వైద్యం, సురక్షిత నివాసం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## చిన్నోనిపల్లి లింక్ కెనాల్‌ను ఆర్.డి.ఎస్ సింధనూర్ 43.85 కిలోమీటర్ వద్ద కలపండి

**- కలెక్టర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ గార్లకు వినతిపత్రం ఇచ్చిన సింధనూర్ సర్పంచ్, మాజీ ఎంపీటీసి**





**ఆలంపూర్ అక్టోబర్ 1((ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి) :** అయిజ మండలంలోని ఆర్. డి .ఎస్ కెనాల్ కు చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి కలిపే లింక్ కెనాల్ ను 43.85 .12ఎా వద్దకిలోమీటర్ వద్ద కలపాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, మాజీ ఎంపీ.టీ.సీ సుధారాణి రవిరెడ్డి.బుధవారం వినతిపత్రం ఇచ్చారు. లింక్ కెనాల్ ఏర్పాటు సర్వే కోసం మంగళవారం ఇరిగేషన్ అధికారులు రావడంతో సింధనూర్, తొత్తినోనిదొడ్డి, కుట్కనూర్, కొత్తపల్లి రైతులు అభ్యంతరం చెప్పారు. ఇప్పటికే అధికారులు ఆర్. డి. ఎస్ లోకి లింక్ కెనాల్ ను 45.03 12ఎా కింద కిలోమీటర్ వద్ద కలిపేందుకు నిర్ణయించారు. ఈ విధంగా చేయడంతో నాలుగు గ్రామాల రైతులకు చెందిన 1500 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం లేదు. అందువల్ల ఇరిగేషన్ అధికారుల అలైన్ మెంట్ ను మార్చి రైతులకు చిన్నోనిపల్లి లింక్ కెనాల్ ద్వారా సాగునీరు అందే అవకాశం ఉన్న 12ఎా డిస్ట్రిబ్యూటర్ వద్ద కలపాలని ఆర్. డి. ఎస్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, అయిజ మాజీ ఎంపీపీ ఉప్పల ప్రహల్లాధ రెడ్డి, సర్పంచ్ తిమ్మోతి, నాయకులు సింధనూర్ జనార్ధన్ గౌడ్, ఉప్పల మల్లేష్ లతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించి 12ఎా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## కొత్త చైర్మన్‌కు ఘన సన్మానం

**మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు**





**పర్వతగిరి, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన అత్తి కుమారస్వామి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చౌటపల్లి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గురువారం ఆయన స్వగృహంలో మండల ప్రథమ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడిశెట్టి రాములు మాట్లాడుతూ కుమారస్వామి తనకు అప్పగించిన పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తూ రైతులు, సహకార సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని దౌలత్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన నాటి తెలుగుదేశం పార్టీ ఫౌండర్ షేక్ నసీరుద్దీన్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తదుపరి ఇటీవల మృతి చెందిన సివిల్ కానిస్టేబుల్ ఐలపాక అశోక్ తండ్రి ఐలపాక ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు.

## వ్యక్తిత్వ వికాసంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి..

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు. వ్యక్తిత్వ వికాసం అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని ఆమె అన్నారు. పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దిశానిర్దేశక కార్య క్రమానికి సీపీ శ్వేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యా ర్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్ష ణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ సమాజానికి ఉపయో గపడే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

**- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..**





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి) :** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్, యువజన నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఓటరును కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాలు, పట్టణాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని చల్లా ధర్మారెడ్డి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టభద్రులు, యువత, ఉద్యోగుల కోసం చేపట్టిన కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోసం నియోజకవర్గ బాధ్యుడిగా పరకాల మండల సీనియర్ నాయకుడు నేతాని శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరకాల పట్టణం, పరకాల, నడికుడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ మండలాలతో పాటు జీడబ్ల్యూఎంసీ 15, 16, 17 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద రక్తదానం ప్రాణదానంతో సమానం..

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య..**





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** స్వచ్ఛంద రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్) రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య జెండా ఊపి ప్రారంభించారు. కుమార్‌పల్లి మీదుగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఇది గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, అధికారులు స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సీహెచ్ఓ ప్రేమలత, డెమోలు సువార్త, ఎల్లయ్య, రవీందర్, ఎంపీహెచ్ఈఓ విప్లవ్ కుమార్, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు, పీహెచ్ఎన్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గృహ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

- రీజనల్ డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు..
- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ..





**పరకాల, అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** పరకాల పట్టణంలోని గొడ్ల అంగడి ముందు, ఇంటి నంబర్ 3-277 వద్ద మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణం జరుగుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ రీజనల్ డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాదిగ మాట్లాడుతూ.. సదరు నిర్మాణానికి భవన నిర్మాణ అనుమతులు ఉన్నాయా, ఆమోదిత నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగా నిర్మాణం జరుగుతోందా అనే అంశాలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని కోరారు. రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా కింద వదలాల్సిన స్థలాన్ని వదలకుండా నిర్మాణం చేపట్టినట్లు, భవనం చుట్టూ నిబంధనల ప్రకారం అవసరమైన ఖాళీ స్థలం లేకుండా నిర్మిస్తున్నట్లు స్థానికంగా అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. భవనం ముందు భాగంలో రోడ్డు వైపు బాల్కనీని పొడిగించి నిర్మించినట్లు, డ్రైనేజీపై పిల్లర్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. వీటివల్ల ప్రజల రాకపోకలకు, డ్రైనేజీ నిర్వహణకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున అధికారులు ఈ అంశాలను కూడా పరిశీలించాలని కోరారు.

ఈ నిర్మాణంపై ఇప్పటికే పరకాల మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని శంకర్ మాదిగ తెలిపారు. భవన నిర్మాణ అనుమతి, ఆమోదిత నిర్మాణ ప్రణాళిక, సెట్‌బ్యాక్‌లు, రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా, బాల్కనీ నిర్మాణం, డ్రైనేజీపై ఏర్పాటు చేసిన పిల్లర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అధికారుల విచారణలో నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజా స్థలం, రోడ్డు, డ్రైనేజీకి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఏకు శంకర్ మాదిగ కోరారు.

### జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరించిన

## బిసి హక్కుల సాధన సమితి నాయకులు జిల్లా జాయింట్ సెక్రెటరీ బొట్ల శ్రీనివాస్



**రాయపర్తి అక్టోబర్ 01 ప్రజాజ్యోతి :** అక్టోబర్ 16న వరంగల్ పట్టణం శివనగర్ లోని రాజశ్రీ గార్డెన్‌లో జరగనున్న బిసి హక్కుల సాధన సమితి 2వ మహ సభల కరపత్రాలను మండల కేంద్రమైన రాయపర్తిలో బిసి నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ బొట్ల శ్రీనివాస్ మండల అధ్యక్షుడు రావుల అనిల్ కుమార్ ప్రధాన కార్యదర్శి మచ్చా కుమారస్వామి ,గౌరవ అధ్యక్షులు గజవెల్లి ప్రసాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లా ఎల్లాగౌడ్ లు మాట్లాడుతూ నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కలతో పాటు బిసి కులాల వారిగా జనాభా లెక్కలు తీయాలని, ఒక్కో కులానికి ఒక్కో యూనిక్ నెంబర్ ఇవ్వాలనీ బిసిల జనాభా లెక్కల ప్రకారం విద్య ఉద్యోగ, రంగాల్లో స్థానిక సంస్థలలో అసెంబ్లీలో పార్లమెంటులో బడ్జెట్లో బిసిల వాటా బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ హక్కులు సాధించకపోతే రాబోయే రోజుల్లో బిసిల అస్థిత్వం దెబ్బతింటుందన్నారు. హక్కుల సాధన కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకొనే లక్ష్యంతో రాజకీయ పార్టీలకు అతీతంగా 12 మండలాల నుంచి వందల సంఖ్యలో ప్రతినిధులు హాజరు కాబోతున్నారన్నారు. ఈ మహాసభల విజయవంతా నికి పోస్టర్లు, మైక్ ప్రచార జాత వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. రాయపర్తి మండలం నుంచి 200 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ మహాసభల విజయవంతానికి బిసిలంతా ఆర్థిక హార్దిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పాము మనోహర్ చిట్యాల వెంకటేశ్వర్లు, దేశ బోయిన ఉపేందర్ మచ్చ రమేష్ మారోజు వెంకటేశ్వర్లు ఎనగందుల యాదగిరి పులి ఓంకార్ పుల్లా శ్రీనివాస్ గుంటుక నాగరాజు ఎనగందుల నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసి, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయా లని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారు లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఎంపీ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి పాల్గొని వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు తదితర శాఖల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై సమీక్షించారు. ఎంపీ ఫండ్స్‌తో చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేసి, చెల్లింపులను కూడా వేగవంతం చేయాలని ఎంపీ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీల వివరాలను వంద శాతం నమోదు చేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో మధుమేహ బాధితులకు ఇన్సులిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, క్యాన్సర్ వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. బాలల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని రహదారుల శాఖ అధికారులను సూచించారు. దిశ కమిటీ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ధర్మసాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి గణితం, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హసన్‌పర్తి, దేవన్నపేట, టేకులగూడెం, వంగపహాడ్, మడికొండ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాలని, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి గడపకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీఈఓ ఎల్.వి. గిరిరాజు గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజయ పాల సహకార సంఘం అధ్యక్షునిగా మహ్మద్ గులాం రసూల్

**పాల ఉత్పత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తా: రసూల్**



**దేవరుప్పుల, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామ విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం నూతన అధ్యక్షునిగా మహ్మద్ గులాం రసూల్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. గురువారం పాలకేంద్రం ఆవరణలో సభ్యులందరూ సమావేశమైన సందర్భంగా ప్రస్తుత అధ్యక్షుడు పంగ శ్రీనివాస్ అనివార్య కారణాల వల్ల నేను నా పదవికి రాజీనామ చేస్తున్నానని తెలపడంతో సభ్యులందరూ నూతన అధ్యక్షుడిగా మహ్మద్ గులాం రసూల్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.నూతన అధ్యక్షుడు రసూల్‌ను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు యాదయ్య, యాదవరెడ్డి, సతీష్, చంద్రయ్య, లక్ష్మయ్య, మణెమ్మ, జోజమ్మ, భాస్కర్, శ్రవణ్, ప్రభాకర్ రెడ్డి, చంద్రా రెడ్డి, అంజయ్య, ఆనంద్ కుమార్,పాల ఉత్పత్తి దారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

**- విద్యార్థినులకు పరిశుభ్రతపై అవగాహన**




**దేవరుప్పుల, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దేవరుప్పుల సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ భూమేష్ మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఐ ఆర్ఓ విశ్వనాథ్, యూబీఐ బ్యాంకు సిబ్బంది, కేజీబీవీ ఎస్ఓ రజిత, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు, విడ్స్ కౌన్సిలర్ పాము స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథులుగా హాజరై టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. టీబీ నిర్మూలన లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంఘాలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీబీ రోగులకు అవసరమైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చల్లా పరామర్శలు



**వరంగల్ అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో ఇటీవల మృతిచెందిన బెజ్జాల మొగిలి, అచ్చే ఉపేంద్ర కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి







**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసి, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఎంపీ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి పాల్గొని వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు తదితర శాఖల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై సమీక్షించారు. ఎంపీ ఫండ్స్‌తో చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేసి, చెల్లింపులను కూడా వేగవంతం చేయాలని ఎంపీ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యా మ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీల వివరాలను వంద శాతం నమోదు చేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో మధుమేహ బాధితులకు ఇన్సులిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, క్యాన్సర్ వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. బాలల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని రహదారుల శాఖ అధికారులను సూచించారు. దిశ కమిటీ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ధర్మసాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి గణితం, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హసన్‌పర్తి, దేవన్నపేట, టేకులగూడెం, వంగపహాడ్, మడికొండ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాలని, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి గడపకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీఈఓ ఎల్.వి. గిరిరాజు గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి

## ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 01(ప్రజా జ్యోతి) :** దివంగత నాయకుడు,మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రజాసేవకు ప్రతిరూపంగా నిలిచారని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ చౌరస్తాలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన ప్రజా జీవితాన్ని,ప్రజల కోసం చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.పేదల సంక్షేమం, సామాజిక అభ్యున్నతి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం దామోదర్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్,డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య,జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొరిశెట్టి లక్షాది,మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి షఫీ ఉల్లా తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 50 కిలోల బియ్యం అందజేత



**ఆలేరు అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ఇటీవల మరణించిన ఎండి హుస్సేన్ కుటుంబ సభ్యులకు ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ గురువారం పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన విభాగం జనరల్ సెక్రెటరీ జింకల భరత్, పల్లె మహేష్, హరికృష్ణ చంద్రశేఖర్, వంశీ విష్ణు కార్తిక్ పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత




**వలిగొండ అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన తోటకూరి నర్సింహ,చంద్రగిరి మత్స్యగిరి,పోలేబోయిన గంగయ్య,ఎలగందుల సుదర్శన్ లు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందగా చికిత్స నిమిత్తం వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి తోటకూరి నర్సింహ 24 వేలు,చంద్రగిరి మత్స్యగిరి 60,000 వేలు,పోలేబోయిన గంగయ్య 26,000 వేలు,ఎలగందుల సుదర్శన్ 37 వేల రూపాయలు మంజూరైన చెక్కులను గురువారం స్థానిక సర్పంచ్ ఏర్పుల వెంకటేశం చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ వార్డు సభ్యులు కాడిగళ్ల రామనర్సింహ,ఏర్పుల పద్మ యాదయ్య నాయకులు షేక్ రసూల్,పులిపలుపుల రాములు,గన్నెబోయిన నర్సింహ,కోలగాని యాదయ్య,కాడిగల్ల రవి,ఇంజమూరి నాగేష్,కాడిగల్ల లింగయ్య,ఇంజమూరీ నర్సింహ,దొంతి రమేష్,పులిపలుపుల శంకరయ్య,గోనె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ఆర్ఎస్ పాఠశాలకు 10 ఫ్యాన్ల వితరణ

## రూ.20 వేల విలువైన ఫ్యాన్లను అందించిన సంకినేని కుటుంబం



**తుంగతుర్తి, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** ప్రముఖ కాంట్రాక్టర్ సంకినేని కృష్ణారావు సతీమణి హేమలత జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో నీ టీఎస్ఆర్ఎస్ పాఠశాలకు రూ.20 వేల విలువైన 10 ఫ్యాన్లను వితరణ చేశారు. సంకినేని కృష్ణారావు మనవడు మన్విై బాబు చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కు ఫ్యాన్లను అందజేశారు.

పాఠశాలకు గతంలో స్థలం అందించడంతో పాటు భవన నిర్మాణానికి సంకినేని కుటుంబం చేసిన కృషి అభినందనీయమని స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబా అన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సౌకర్యార్థం 10 ఫ్యాన్లను అందించడం ద్వారా విద్య పట్ల తమ కుటుంబానికి ఉన్న అభిమానం మరోసారి చాటుకున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, పాఠశాల సిబ్బంది, స్థానిక ఉపసర్పంచ్ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణదాసు, నాగరాజు, గాజుల మహేందర్, వార్డు సభ్యులు బొజ్జ యాదగిరి, నరేష్, నరసింహ, రాంబాబు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు ఇచ్చిన మాట నెరవేర్చాలి

## - ఎమ్మార్పీఎస్ ఆలేరు మండలాధ్యక్షుడు కృష్ణ



**ఆలేరు అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు దళితులకు ఇచ్చినటువంటి హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని ఇప్పటికైనా ఇచ్చిన మాట నెరవేర్చాలని ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు ముద్దేపాక కృష్ణ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు మోహన్ పిలుపుమేరకు పోస్టర్ ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 5వ తేదీ యాదాద్రి భువనగిరి జిల్లాలో అడ్డగూడూరు నుండి భువనగిరి వరకు నిర్వహించే బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంఘీ స్వామి,మండల ఇన్చార్జి బైరపాక సురేష్, లాజర్ శ్రీను విజయ్ రమేష్ ఎల్లయ్య అనిల్ సుదర్శన్ శివ ఇసాక్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# చందుపట్లలో ముత్యాలమ్మ బోనాల పండుగలో పాల్గొన్న దైద రవీందర్



**నల్లగొండ అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిగోజు లత వెంకటాచారి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆటల్లో అదుర్స్.. ఆదర్శ పాఠశాల విద్యార్థులు

## - జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం



**నల్లగొండ అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** శాలిగౌరారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుకున్నారు. దేవరకొండలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఆదర్శ పాఠశాలకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థిని ఎస్.కె. నస్రిన్, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.కె. రెహానా బాలికల విభాగంలో నల్లగొండ జోన్‌కు ఎంపికయ్యారు. అలాగే పదో తరగతి విద్యార్థి పి. విజయ్ అండర్-17 బాలుర విభాగంలో నల్లగొండ జోన్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో క్రీడల్లో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో పాటు పీడీ మల్లేశ్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# స్థానిక ఆహారంతో పోషకాహారం తీసుకోవాలి



**నల్లగొండ, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** పోషణ మాసం సందర్భంగా శాలిగౌరారం మండలం మాధవరం కలాన్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం--2లో పిల్లలు, తల్లులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాధవరం సర్పంచ్ తోటకూరి పరుశురాములు హాజరై పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబాల హరీష్, వార్డు సభ్యుడు రాజుల శ్రీకాంత్, దాసరి మానస, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ డి.రాధ, హెల్పర్ సీహెచ్. పులమ్మ, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పోషణ పండుగలో భాగంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలను ప్రదర్శించి, వాటి పోషక విలువలను వివరించారు.

# పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- ప్రతి మండలంలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఓటరు నమోదు పూర్తి చేస్తాం
- బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్





**తుంగతుర్తి(తిరుమలగిరి), అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి) :** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం తిరుమలగిరి పట్టణంలో తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ, ఫామ్-18 దరఖాస్తుల స్వీకరణ, గ్రామాల వారీగా ఓటర్లను చేర్పించే విధానం, ఎన్నికల కార్యాచరణపై నాయకులతో చర్చించారు. ప్రతి మండలానికి ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు.

**పట్టభద్రు లే తొలి దెబ్బ కొట్టాలి :**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. మేధావులు, విద్యావంతులు, యువత సమాజంపై సంపూర్ణ అవగాహనతో ఓటు వేస్తారని, అందువల్ల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి దెబ్బ పట్టభద్రుల నుంచే తగలడం ఖాయమని అన్నారు.

**ప్రతి మండలంలో హెల్ప్‌డెస్క్‌లు :** పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రతి మండలంలో హెల్ప్‌డెస్క్ లను ఏర్పాటు చేస్తామని కిశోర్ కుమార్ తెలిపారు. గ్రామాల వారీగా పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు.ఎవరైతే తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తున్నారో వారితోనే ఫామ్-18 నింపించి పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

**సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తీసుకురావాలి :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తీసుకువస్తే బీఆర్ఎస్ నాయకత్వంతో మాట్లాడి ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి తప్పుకునే విషయాన్ని పరిశీలిస్తామని కిశోర్ కుమార్ వ్యాఖ్యానించారు. బుల్లెట్ ట్రైన్‌ను సూర్యాపేట మీదుగా కాకుండా గుంటూరు మీదుగా తరలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు కలిసి కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సూర్యాపేట జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఇప్పటికైనా హామీలు అమలు చేయాలి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజకీయ విమర్శలకు పరిమితమవుతోందని కిశోర్ కుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపాల మాటలు మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.ప్రభుత్వం తన పాలనపై దృష్టి సారించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, నిరుద్యోగులు, విద్యావంతులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

**సిరిసిల్ల సభపై ఘాటు వ్యాఖ్యలు :** సిరిసిల్లలో జరిగిన కాంగ్రెస్ సభపై కూడా మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ సభ దండయాత్ర మాదిరిగా కనిపించలేదని, దండుపాళ్యం బ్యాచ్ కలిసి యాత్ర చేసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

కేటీఆర్ పై గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేటీఆర్ కాలిగోటుకు కూడా రేవంత్ రెడ్డి సరిపోరని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ ప్రపంచంలోని ఏడు కంపెనీలకు సీఈఓగా పనిచేసిన ఉన్నత విద్యావంతుడని పేర్కొన్నారు.

**పట్టభద్రుల తీర్పు కీలకం :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, విద్యావంతులు, యువత తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించాలని కిశోర్ కుమార్ కోరారు. సమాజం, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పాలనపై అవగాహన ఉన్న పట్టభద్రులు ఈ ఎన్నికల్లో తమ తీర్పును ఓటు ద్వారా వెల్లడిస్తారని అన్నారు.ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు పట్టభద్రులను కలిసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఫామ్-18 ద్వారా తమ ఓటును నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు, నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మి నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు,ఆయా గ్రామాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిలు, మండలాల ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీజేసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



**మిర్యాలగూడ, అక్టోబర్ 01, (ప్రజాజ్యోతి) :** మిర్యాలగూడ పట్టణం లోని జీజేసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. జనయేత్రి ఫౌండేషన్ మరియు రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కామిశెట్టి సత్యనారాయణ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి వాకర్స్‌తో పాటు పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమానికి 17వ వార్డు కౌన్సిలర్, ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో జీజేసీ గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వాకర్స్‌తో పాటు పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించడం ప్రజలకు ఎంతోప్రయోజనకరమని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెబోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణ కాంత్ నాయక్ లు మాట్లాడుతూ పట్టణంలోని పేద ప్రజలు, వాకర్స్ ఆరోగ్యాన్ని కాపాడాలనే సంకల్పంతోనే ఈ క్యాంప్ ఏర్పాటు చేశామని, దీనికి సహకరించిన జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మునీర్, కామిశెట్టి సత్యనారాయణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో వివిధ వైద్య విభాగాల్లో నిపుణులుగా పేరుపొందిన డాక్టర్లు బాలాజీ, నాగేశ్వరరావు,నాగు నాయక్, వికాస్, రాంబాబు,ప్రసాద్ నాయక్, మణికంఠ, నిఖిల్ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడమే కాకుండా, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించిన డాక్టర్లు, ల్యాబ్ అసిస్టెంట్లు,



మెడిసిన్ అందించిన దాతలను, వారి సిబ్బందిని జీజేసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జానకిరామ్ రెడ్డి, వెంకట్ రత్నం, కోశాధికారి చిన వెంకన్న, కార్యదర్శులు పులి శ్రీనివాస్ గౌడ్, నామ రత్నకుమార్, డైరెక్టర్లు సక్రాం నాయక్, శ్రీను,సైదులు, మహేష్ రెడ్డి, రాధి రాజేశ్వరి, అశోక్, నాగరాజు కృష్ణ రెడ్డి అలాగే సభ్యులు ఇద్దయ్య, పిచ్చయ్య, హేమ్లు నాయక్, నాగు నాయక్, వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అనిల్, బధ్య నాయక్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన

## - ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి




**నల్లగొండ అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌లో భాగంగా గురువారం నకిరేకల్ పట్టణంలో ఫ్లాష్ వాక్ నిర్వహించారు. శాలిగౌరారం సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నకిరేకల్ ఎస్ఐ వీరబాబు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు, యువత, ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్, క్యూఆర్ కోడ్, యూపీఐ, ఓటీపీ, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడులు, అనుమానాస్పద లింకులు, ఏపీకేలు, సోషల్ మీడియా మోసాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, "ఆగండి--ఆలోచించండి--ధృవీకరించండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు సూచించారు.



# నోములలో శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీవో



**నల్లగొండ అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** నకిరేకల్ మండలం నోముల గ్రామంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.ఇ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మాచారి, సర్పంచ్ పొట్టబతుల జయమ్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడబ్ల్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కె ఎన్ ఎంలో ముగిసిన ప్రాంగణ ఎంపికలు

## - 9 మందికి ఉద్యోగాలు





**మిర్యాలగూడ, అక్టోబర్ 01, (ప్రజా జ్యోతి) :** మిర్యాలగూడ కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు హెటెరో ల్యాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ నియామక ప్రక్రియ గురువారం ముగిసింది. ఇందులో 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నియామక ప్రక్రియలో అర్హత కలిగిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. విద్యార్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం హెటెరో ల్యాబ్స్ ప్రతినిధులు వంశీ మాధవ్, అజయ్ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. మొదటి రోజు రాత పరీక్ష, రెండవరోజు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రధానాచార్యులు మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కళాశాల తరపున వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నామని, ప్రస్తుత, పూర్వ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి క్యాంపస్ నియామకాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కళాశాల ప్రాంగణ నియామకపు అధికారులు డా. పి.రవిందర్, పి.నాగరాజు, అధ్యాపకులు ఎల్లయ్య, లింగరాజు, ప్రవీణ్ రెడ్డి, తోటి విద్యార్థులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## జీకే తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఇందల్వాయి:( ప్రజా జ్యోతి ) అక్టోబర్. 1** ఇందల్వాయి మండల కేంద్రంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ శిరీష మహిపాల్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. సర్పంచ్ శిరీష మహిపాల్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని రైతులకు తెలిపారు. ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి కాంటా వేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రజిత, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## స్టేషన్ తండాలో విబిజి రాంజీ పనులపై అవగాహన



**ఇందల్వాయి:(ప్రజా జ్యోతి) అక్టోబర్.1** ఇందల్వాయి మండల కేంద్రంలోని స్టేషన్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వి.బి.జి. రాంజీ కార్యక్రమం ద్వారా చేపట్టాల్సిన పనులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తిస్తూ గ్రామ కంట మ్యాప్‌ను రూపొందించి, అందులో చేపట్టాల్సిన పనులను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద



చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై గ్రామ ప్రజలతో చర్చించారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పించే పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీవో పోశెట్టి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గంగారం తండాలో విబిజి రాంజీ పనుల పట్టిక ఏర్పాటు

**ఇందల్వాయి:( ప్రజా జ్యోతి) అక్టోబర్. 1** ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో వి.బి.జి. రాంజీ కార్యక్రమం ద్వారా చేపట్టాల్సిన పనుల పట్టికను గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్, ఉపసర్పంచ్ ధూమ ఆధ్వర్యంలో రూపొందించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను గుర్తించి పట్టికలో పొందుపరిచారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీవో పోశెట్టి ఆదేశాల మేరకు గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, శ్రీను, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ప్రత్యేక ఖో-ఖో సంఘాలు

- అక్టోబర్ 22న రెండు జిల్లాల్లో ఎన్నికలు.. ప్రక్రియ ప్రారంభం

**కామారెడ్డి రూరల్, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి)** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్‌ను నూతన జిల్లాల ప్రకారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ఖో-ఖో అసోసియేషన్లుగా విభజించి, రెండు జిల్లాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వి. భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అతికుల్లా తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్‌ను నూతన జిల్లాల ప్రకారం విభజించి, ప్రత్యేక జిల్లా సంఘాలను ఏర్పాటు చేయాలని 2026 జూలై 12న నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఆ తీర్మానం మేరకు ప్రస్తుతం రెండు జిల్లాలకు ప్రత్యేక సంఘాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు.

**నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణ**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్), తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలాల వారీగా ఓటర్ల జాబితాలు, జనరల్ బాడీ సభ్యులు, ప్రతినిధుల పేర్లు, వారి హోదాలకు సంబంధించిన వివరాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన ప్రతినిధులు పాల్గొనేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**అక్టోబర్ 22న నిజామాబాద్‌లో ఎన్నికలు**

నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఎన్నికలను అక్టోబర్ 22, 2026న నిజామాబాద్‌లోని ఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**కామారెడ్డిలోనూ అదే రోజు ఎన్నికలు**

అదేవిధంగా కామారెడ్డి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఎన్నికలు కూడా అక్టోబర్ 22, 2026న కామారెడ్డిలోని లయోలా ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు జిల్లాలకు ప్రత్యేక సంఘాలు ఏర్పడటంతో స్థానికంగా ఖో-ఖో క్రీడా కార్యకలాపాలను మరింత సమన్వయంతో నిర్వహించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**పరిశీలకుల నియామకానికి విజ్ఞప్తి**

ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ కార్యాలయాల నుంచి ఎన్నికల పరిశీలకులను డిప్యూట్ చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే సంబంధిత జిల్లా ఒలింపిక్ అసోసియేషన్లు కూడా ఎన్నికల అధికారులను లేదా పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.

**క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు**

నూతన జిల్లాల ప్రకారం ప్రత్యేక ఖో-ఖో అసోసియేషన్లు ఏర్పడటం ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఖో-ఖో క్రీడ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, పోటీలు, ఎంపికల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక జిల్లా సంఘాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఖో-ఖో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రోత్సహించేందుకు సంఘాలు కృషి చేస్తాయని తెలిపారు. రెండు జిల్లాల్లో ఖో-ఖో క్రీడను మరింత విస్తృతంగా అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులకు మెరుగైన వేదిక కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

# థిమ్మక్‌పల్లిలో ఐకేపీ సెంటర్ ఏర్పాటు

- రైతులు, మహిళా సంఘాలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు గ్రామస్తులు సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరు



**కామారెడ్డి రూరల్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలంలోని థిమ్మక్‌పల్లి గ్రామంలో ఐకేపీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు, స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సేవలు మరింత చేరువ చేసేందుకు ఐకేపీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఐకేపీ సెంటర్ ఏర్పాటు కార్యక్రమానికి గ్రామంలోని రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు జిన్న బాలయ్య పాల్గొని రైతులకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ అందుబాటులోకి రావడం వల్ల రైతులకు, గ్రామీణ ప్రజలకు పలు సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఐకేపీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ప్రజాప్రతినిధుల హాజరు**

ఐకేపీ సెంటర్ ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గుర్రాల లక్ష్మి, ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్ హాజరయ్యారు. అలాగే గ్రామంలోని వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ఐకేపీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని వారు పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు ప్రయోజనం**

కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలుతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, సేవలు, శిక్షణ, ఇతర కార్యక్రమాలను గ్రామస్థాయిలోనే తెలుసుకునే అవకాశం ఐకేపీ కేంద్రం ద్వారా లభిస్తుందని తెలిపారు.

**ఐకేపీ అధికారులు, సిబ్బంది పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో ఐకేపీకి సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొని కేంద్రం నిర్వహణ, గ్రామస్థాయిలో అందించే సేవలు, రైతులు మరియు మహిళా సంఘాలకు అందుబాటులో ఉండే కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సేవలను అందించేందుకు ఐకేపీ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఐకేపీ సెంటర్ ఏర్పాటు కావడంతో గ్రామంలోని రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపై పలు ప్రభుత్వ కార్యక్రమాలు, వ్యవసాయ సంబంధిత సమాచారం, మహిళా సంఘాలకు సంబంధించిన కార్యకలాపాల కోసం అవసరమైన సమాచారాన్ని స్థానికంగానే పొందే అవకాశం కలుగుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల లక్ష్మి, ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్, వార్డు సభ్యులు, రైతు కమిటీ అధ్యక్షుడు జిన్న బాలయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నేడు నిరసన



**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నేడు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయు) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ పిలుపునిచ్చారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపులో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నేడు సంగారెడ్డిలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### అధ్వానంగా మునిదేవునిపల్లి

## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం!

- సబ్‌హెడ్‌లైన్: అధికారుల పర్యవేక్షణ లేకే ఈ నిర్లక్ష్యమా..?
- నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజనం నాణ్యతపై తగిన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యంపై





ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యమైనదిగా, పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే భోజన నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటుందా అని వారు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేలా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. భోజనం నాణ్యతలో నిర్లక్ష్యం కొనసాగితే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, భోజనం తయారీ విధానాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు పోస్ట్‌కార్డు ఉద్యమం

- అక్టోబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం
- భారీ ఎత్తున సంగారెడ్డికి తరలిరావాలని టియుడబ్ల్యూ జే హెచ్ 143 పిలుపు

**పటాన్‌చెరు (ప్రజాజ్యోతి)** జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డులు జారీ చేయడంతో పాటు, మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈజేహెచ్‌ఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కమిటీ దశలవారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించనున్నారు. అక్టోబర్ 8 వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. 50 పైసల పోస్ట్‌కార్డుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన డిమాండ్ లను రాసి ముఖ్యమంత్రి




కార్యాలయానికి పంపించాలని సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందించాలని, ప్రస్తుతం ఉన్న ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఈ జె.హెచ్.ఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పోస్ట్‌కార్డులు పంపనున్నారు. పోస్ట్‌కార్డులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం సీఎంఓ 6వ అంతస్థు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, హైదరాబాద్--500022 చిరునామాకు పంపాలని రాష్ట్ర నాయకులు సూచించారు. ప్రతి జర్నలిస్టు తన పేరు, పనిచేస్తున్న సంస్థ, జిల్లా వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం పిలుపు మేరకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో సంగారెడ్డికి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గోకర్ శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ పిలుపునిచ్చారు.

## చిన్నారుల భవిష్యత్తుకు సృజనాత్మక విద్య అవసరం

- నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకర వాతావరణం కీలకం
- ఫోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్




**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యతో పాటు ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలతో కూడిన ఆహ్లాదకర వాతావరణం ఎంతో అవసరమని యండిర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. జేపీ కాలనీలో ఇటీవల నూతనంగా ప్రారంభమైన ఫోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను ఆయన సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు కేవలం పుస్తకాల ద్వారా విద్యను అందించడం మాత్రమే కాకుండా, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ద్వారా వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచన, సామాజిక నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానం ఉండాలని పేర్కొన్నారు. పిల్లల అభిరుచులు, ఆసక్తులను గుర్తించి వారికి అనుగుణంగా ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో మరింత ప్రతిభావంతులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఫోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ మరింత అభివృద్ధి చెంది మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

### ఉపాధ్యాయుడి డిప్యూటేషన్

## రద్దు చేయాలని డీఈఓకు వినతి



**హత్నూర 1 అక్టోబర్ (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ ను రద్దు చేయాలని గ్రామ సర్పంచ్ బేగరి శ్రీహరి ఉప సర్పంచ్ శంకర్ లు గురువారం నాడు జిల్లా విద్యాధికారి రోహిణి నీ కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నీ యుపిఎస్ పాఠశాలలో ఇప్పటికే విద్యార్థులకు సబ్జెక్టులకు సరిపడ ఉపాధ్యాయుల లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సరైనది కాదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇలా ఉపాధ్యాయులను తరచూ బదిలీ చేసుకుంటూ పోతే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. కావున ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ వెంటనే రద్దు చేసి తిరిగి స్థానిక పాఠశాలలోనే ఉండేలా చూడాలని వారు డీఈఓ ను కోరారు. వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోషా రమేష్ లు డిఈ ఓ ను కలిసిన వారిలో ఉన్నారు.

# స్వచ్ఛ దుబ్బాకలో ప్రతి ఒక్కరూ భాగస్వాలు కావాలి..!

● దుబ్బాక పట్టణంలో పారిశుద్ధ కార్యక్రమం ● దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత

**దుబ్బాక, అక్టోబర్ 01 ( ప్రజా జ్యోతి)** స్వచ్ఛ దుబ్బాకలో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావలని దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీతారవీందర్ పిలుపునిచ్చారు. గురువారం రోజున దుబ్బాక పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో " ఏక్ దిన్ ఏ గంట ఏక్ సాత్ " కార్యక్రమంను






నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పెద్ద చెరువు వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గంతో కలిసి చైర్పర్సన్ సంగీత పాల్గొన్నారు. చెరువు కట్టపైన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. దుబ్బాక పట్టణం చుట్టూ ఉన్న చెరువులున్నందున వాటి పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. చెరువు కట్టలను సుందీరకరించడంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పట్టణానికి మరీంత వన్నే చేకూరుతుందన్నారు. చెరువు కట్టపైన పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, చెరువులో నీటిని ఆపరిశుభ్రత పరచకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో చూడాలని సూచించారు. దుబ్బాక పెద్ద చెరువు పట్టణానికి మణిహారంగా మారిందని, దీని పరిరక్షణలో పట్టణ పౌరులు కృషి చేయాలని కోరారు. దుబ్బాక పట్టణాభివృద్ధితో పాటు పర్యవరణ పరిరక్షణ ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, కౌన్సిలర్లు దేవుని రాజు, చాంద్ మియా, తునికి సురేష్, గంభీర్ పూర్ కనకరాజు, నందాల శ్రీకాంత్ , బడుగు రాజు, బండి శ్రీలేఖ – రాజు, ఐరేని అఖిల– సాయి తేజ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బండి రాజు , ఆస స్వామి, మున్సిపల్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, సిబ్బంది దిలీప్, ఆస రాజశేఖర్,రాజయ్య, తదితరులున్నారు.

# చిరు వ్యాపారులకు వంగ రాజేశ్వర్ రెడ్డి చేయూత

**సిద్దిపేట,అక్టోబర్ 01 ,(ప్రజాజ్యోతి):** రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు వంగ రాజేశ్వర్ రెడ్డి చేయూత అందించారు. ఎండ, వర్షాల నుంచి రక్షణ పొందేందుకు పలువురు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు.సిద్దిపేట పట్టణంలోని వివిధ





ప్రాంతాల్లో తోపుడు బండ్లు, చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని మొక్కజొన్నలు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు విక్రయిస్తూ పలువురు జీవనోపాధి పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డు పక్కనే ఉండాల్సి రావడంతో వాతావరణ మార్పులతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చిరు వ్యాపారుల పరిస్థితిని గుర్తించిన వంగ రాజేశ్వర్ రెడ్డి.. వారికి తక్షణ ఉపయోగపడే సహాయం అందించాలనే ఉద్దేశంతో గొడుగుల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఆయన సూచన మేరకు టీం సభ్యులు ఆయా ప్రాంతాల్లోని చిరు వ్యాపారులను కలిసి గొడుగులను అందజేశారు.ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజల మధ్య తిరుగుతూ వారి అవసరాలను తెలుసుకుని, సాధ్యమైన మేరకు సహాయం అందించడమే లక్ష్యమన్నారు.గొడుగులు అందుకున్న వ్యాపారులు మాట్లాడుతూ.. ఎండలో, వర్షంలో వ్యాపారం నిర్వహించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తమ సమస్యను గుర్తించి ఉపయోగకరమైన గొడుగులు అందించినందుకు వంగ రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి టీం సభ్యులు, చిరు వ్యాపారులు, కూరగాయలు, మొక్కజొన్నల విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత మెట్టుపల్లిని నిర్మిద్దాం

● సర్పంచ్ ధర్మాజీపేట తిరుపతిరెడ్డి

**చిన్నకోదూరు, అక్టోబరు01,(ప్రజాజ్యోతి):–** ప్లాస్టిక్ రైతు మెట్టుపల్లి గ్రామాన్ని నిర్మించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలబడదామని సర్పంచ్ ధర్మాజీపేట తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లో భాగంగ గ్రామంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ తిరుపతిరెడ్డి కోరారు.రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చి, గ్రామ ప్రజల్లో



పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

# పోషకాహారంతో తల్లిబిడ్డ క్షేమం

● మెట్టుపల్లిలో పోషణమాస కార్యక్రమం

**చిన్నకోదూరు, అక్టోబరు01, (ప్రజాజ్యోతి):–** పోషకాహారం సమృద్ధిగ తీసుకుంటేనే ఆరోగ్యపరంగా తల్లిబిడ్డలు క్షేమంగా ఉంటారని మెట్టుపల్లి సర్పంచ్ ధర్మాజీపేట తిరుపతిరెడ్డి తెలిపారు.పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యం,తల్లీబిడ్డల సంరక్షణపై అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు.గర్భిణీలు,బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతతో పాటు ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులకు బాలల హక్కులు,బాలల పరిరక్షణ చట్టాలు, పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. బాలల రక్షణలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులందరు సమష్టిగా బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్వాడీ టీచర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

**నంగునూర్ అక్టోబర్ 1(ప్రజాజ్యోతి):–** మండల పరిధిలో ని పాలమాకుల లో బి ఆర్ యస్ నాయకులు పెర్క సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని గురువారం నాడు మాజీ మంత్రి కన్నీరు హరీష్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాజీ ఏఎంసి చైర్మన్ రెడ్డి సోమిరెడ్డి మైపాల్ రెడ్డి కోల రమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు



# మట్టి అక్రమ రవాణా..

● పోలీసులకు అంతా తెలుసు కానీ అనుమతుల్లేవన్న ఎమ్మార్వో
● రూల్ మేకర్సే రూల్స్ బ్రేక్ చేస్తే ఎలా?

**చిన్నకోదూరు,అక్టోబర్01,(ప్రజాజ్యోతి):–** ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నా పట్టించుకోని వ్యవస్థలు.. కళ్ళుండి చూడలేని స్థితిలో అధికారులు ఉన్నారంటూ ప్రజల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పెద్దకోడూరు శివారులో ఉన్న 315 సర్వే నంబర్లో ప్రభుత్వం ఏఆర్ సబ్ క్వార్టర్స్ కు భూమిని కేటాయించింది. అయితే సంబంధిత భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా సాగుతున్న మట్టి తవ్వకాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమి నుంచి తవ్వుతున్న మట్టిని ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్న అధికారులు మాత్రం మిన్నకుండి పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.నిబంధనల ప్రకారం అయితే అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు కానీ తరలింపులు కాని చేపట్టకూడదు. ఇదంతా అధికారులకు తెలిసినా యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. పెద్దకోడూరు శివారులోని ప్రభుత్వ భూములలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్నారని,తవ్విన మట్టిని టిప్పర్లతో సిద్దిపేటలోని చింతలచెరువు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు వెంచర్ కు అమ్ముకుంటూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయంటు పత్రికల్లో వార్తలొచ్చినా,మట్టి తవ్వకాలకు సంబంధించి సంబంధిత అధికారులను అడగగా తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. ఇదే విషయమై చిన్నకోడూరు తహసిల్దార్ ను ఫోన్లో సంప్రదించగా సిద్దిపేట పోలీసు అధికారులకు మట్టి తవ్వకాలకు సంబంధించిన విషయం గురించి అంతా తెలుసని అనుమతులైతే మా నుండి ఏం లేవని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఉందని తెలిసినప్పటికీ మట్టి తవ్వకాలు, తరలింపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వస్తుండటంతో అధికార యంత్రాంగం తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలింపులకు ఎవరు అనుమతులు ఇచ్చారు? అనుమతులు లేకుంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అధికారికంగా అనుమతులు లేవని ఎమ్మార్వో చెబుతున్నప్పటికీ వాహన యజమాని మాత్రం పోలీసు అధికారులే మట్టి తవ్వుకోవచ్చని చెప్పారని చెప్పటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని రూల్ మేకర్సే రూల్స్ బ్రేక్ చేస్తే ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూముల విషయంలో తెలిసి మరి నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు ఇంకెలా ఉంటాయంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మట్టి తరలింపుతో ప్రభుత్వానికి గానీ, సదరు గ్రామపంచాయతీకి కానీ ఏమైనా ఆదాయం సమకూరిందా అనే మొదలగు అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.











# శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ నూతన కార్యవర్గం ఏర్పాటు

● రామాలయం వద్ద శరన్నవరాత్రోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

**మిరుదొడ్డి, అక్టోబర్ 1, (ప్రజా జ్యోతి):** మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ సమితి ఇరవై నాలుగోవ వార్షికోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో పాటు పూజా కార్యక్రమాలు, అన్నదానం, భజనలు, శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు వివిధ విభాగాలకు బాధ్యతలు అప్పగించారు.కమిటీ అధ్యక్షులుగా బోయిని చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా దోమల రాజు, కోశాధికారిగా మొగుళ్ళ రాజు, సహ కోశాధికారిగా కూచంగారి మల్లేశ్ వ్యవహరించనున్నారు. ఉపాధ్యక్షులుగా మంగోలు భానుప్రసాద్, నేరండ్ల తేజ గౌడ్, అరుణ్, కానుగంటి స్వామి, చల్లూరి అరుణ్ లను నియమించారు. కార్యదర్శులుగా దుబ్బారాజోళ్ల శ్రవణ్, గొట్టం కుమార్, మద్దెల రాజు, దుబ్బారాజోళ్ల స్వామి, గాజుల దినేశ్ బాధ్యతలు చేపట్టనున్నారు.ఉత్సవాల నిర్వహణలో భాగంగా పలు విభాగాలకు ప్రముఖులను నియమించారు. పూజా ప్రముఖ్‌లుగా నేరండ్ల నవీన్, కమ్మరి స్వామి, అన్నదాన ప్రముఖ్‌లుగా కమ్మరి కుమార్ స్వామి, గంజి కొండల్ రెడ్డి, గొట్టం భైరయ్య, నేరండ్ల వెంకటేష్ వ్యవహరించనున్నారు. ప్రచార ప్రముఖ్‌లుగా ఢిల్లీ రాజు, అస్కా స్వామి, నేరండ్ల వీరేశం, కోలా విజయకుమార్, భజన ప్రముఖ్‌లుగా సత్తు బాల్ రెడ్డి, మొగుళ్ళ ఐలయ్య, అంబటి నర్సింలు లను నియమించారు. అలాగే శోభాయాత్ర ప్రముఖ్‌లుగా గొల్ల





విజయ్ కుమార్, కుమ్మరి సురేశ్, సుతారి పరశురాములు, ధ్వని ప్రముఖ్‌లుగా బిజ్జి చంద్రశేఖర్, బిజ్జి సాయి, రంగమైన సుమన్ బాధ్యతలు నిర్వహించనున్నారు.

**సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం**

నవరాత్రి ఉత్సవాల్లో భక్తి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాంస్కృతిక ప్రముఖ్‌లుగా ఎలుముల మధు, నందిని మాస్టర్, గొట్టం స్వరూప బాధ్యతలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు చేరేలా సోషల్ మీడియా బాధ్యతలను పూస రాజు, మొగుళ్ళ కుమార్, రంగమైన స్వామి చేపట్టనున్నారు. కార్యవర్గ సభ్యులుగా పయ్యావుల నర్సింలు, గాండ్ల బాలకృష్ణ, మొగుళ్ళ భరత్, చిటుకుల అజయ్, తాటిచ్చేట్టు రమేష్, దార రాజు, మద్దెల స్వామి, కానుగంటి సాకేత్, ఆనంతోజు వెంకటాచారి, తాటిచెట్టు రాజులను నియమించారు. రామాలయం వద్ద జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాలు, భజనలు, అన్నదానం, శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాల్లో మిరుదొడ్డి మండల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# వైద్య వృత్తికి కళంకం తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ ● సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన.. డాక్టర్‌కు వినతి

**చేర్యాల అక్టోబర్ 01(ప్రజాజ్యోతి):** మాదాపూర్ ఘటనకు సంబంధించి వ్యభిచారానికి పాల్పడి వైద్య వృత్తికి కళంకం తీసుకొచ్చిన వైద్యుల ఆస్పత్రులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ డిమాండ్ చేశారు. గురువారం చేర్యాల బస్తి దవాఖాన ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం డాక్టర్ తిరుపతి ద్వారా జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో ఉండి మాదాపూర్ కేసుకు సంబంధించి చేర్యాలకు చెందిన కొందరు వైద్యుల పేర్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై సంబంధిత ఆసుపత్రులను తనిఖీలు చేపట్టి సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని పేర్కొన్నారు. ఎంతో పవిత్రమైనటువంటి వైద్య వృత్తిలో ఉండి ఆస్పత్రులు నడిపిస్తున్న డాక్టర్లే వ్యభిచారానికి పాల్పడం సిగ్గుచేటని అన్నారు. వైద్య వృత్తి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు, నమ్మకంతో ముడిపడి ఉన్నందున ఆరోపణలు నిజమని విచారణలో తేలితే సంబంధిత వైద్యులపై నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆసుపత్రులను సీజ్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జంగిలి యాదగిరి, కుడిక్యాల బాల్ మోహన్, మండల కోశాధికారి నంగి కనకయ్య, బూరుగు సత్తయ్య గౌడ్, పొన్నబోయిన మమత, బంగారు ప్రేమ్ కుమార్, బింగి పోషయ్య, కోతి ఎల్లిషా, చరణ్, మల్లేశం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ పేటలో గాంధీ విగ్రహం ధ్వంసం

**నంగునూరు అక్టోబర్ 1 లి(ప్రజా జ్యోతి):–** నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం కలకలం రేపింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సర్పంచ్ చేర్యాల వాణి రాధాకృష్ణ మాట్లాడుతూ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేర్యాల వాణి రాధాకృష్ణ వార్డు మెంబర్లు ముక్క అనిల్ మేడోజు మహేష్ ముంద్రాతి లింగం గోవిందారం బాలకృష్ణ పద్మ ఐలయ్య నాయకులు రాజమౌళి యాదగిరి లింగయ్య యాదగిరి నాగరాజు బాలరాజ్ ఎల్లయ్య నాగార్జున్ రాజనర్సు సాయిబాబు వంశీ రమేష్ శేఖర్ రాజు కుద్దు తదితరులు పాల్గొన్నారు.



## అందుబాటు ధరల్లోకి క్యాన్సర్ చికిత్సా విధానాలు రావాలి

**– ఐఏఎస్ గౌరవ్ ఉప్పల్**




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కమిషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో జస్ ఆంకో' పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేర్ సెంటర్‌ను గురువారం ఆయన సంస్థ వ్యవస్థాపకురాలు డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి బాలకృష్ణన్‌తో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్యాన్సర్ చికిత్సకు ప్రభుత్వం నుంచి పలు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రైవేట్ సంస్థలు కూడా రోగులకు అందుబాటు ధరల్లో వైద్యాన్ని అందించాలని,ఇలాంటి కేంద్రాలు మరిన్ని రావాలని సూచించారు. జస్ ఆంకో ఫౌండర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమిళనాడు కేంద్రంగా కొనసాగుతున్న తమ సంస్థ కార్యకలాపాలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నామని అందులో భాగంగానే తొలి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్‌గా ఉండాల్సిన అవసరం లేకుండానే ఎన్నో రకాల క్యాన్సర్ వ్యాధులకు డే కేర్ ప్రొసీజర్‌లో వైద్యం అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. రోగులపై ఆర్థిక భారం తగ్గించే విధంగా తాము వైద్య చికిత్సా విధానలను అవలంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ డేకేర్ సెంటర్‌లో కీమోథెరపి, ఇమ్యునో థెరపి, టార్గెటెడ్ థెరపి వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్స్ చైర్మన్ డాక్టర్ అంబటి రాంపాపారావు, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ రీజినల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ముక్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు స్వాగతం

**– డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ**
**– కొత్తూరు వై జంక్షన్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన హుస్సేన్ నాయక్**




**కొత్తూరు అక్టోబర్ 01 (ప్రజా జ్యోతి) :** సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కు కొత్తూరు వై జంక్షన్లో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. దుర్వాసన, కాలుష్యం, చెత్త వ్యర్థాల ప్రభావం, ఆరోగ్య సమస్యలు, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య తీవ్రతను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సిద్ధాపూర్‌కు బయలుదేరారు.

అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సూరారం డివిజన్‌లో రూ.80 లక్షలతో నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1(ప్రజా జ్యోతి) :** సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్‌లో బస్తీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద సౌజన్యంతో, జీహెచ్ఎంసీ పాలకమండలి ద్వారా గతంలో విడుదలైన కార్పొరేటర్ డెవలప్‌మెంట్ ఫండ్‌లో భాగంగా శ్రీరామ్ నగర్ మరియు కృష్ణానగర్ ప్రాంతాల్లో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణ పనులకు మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ , డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ, గత పాలకమండలి పదవీకాలం పూర్తయిన సందర్భంగా అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం కార్పొరేటర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద విడుదలైన నిధులతో పలు అభివృద్ధి పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూరారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి కొత్తగా ఒక్క పని కూడా ప్రతిపాదించలేదని విమర్శించారు. గత పాలకమండలి హయాంలో మంజూరైన నిధులతోనే ప్రస్తుతం పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలకు అవసరమైన నాణ్యమైన రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, సూరారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి కృష్ణ నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బషీరుద్దీన్, మాజీ అధ్యక్షులు శివగుప్త, సుమలత,మురళీధర్, సంధ్య,సునీల్ మరియు కాలనీ ప్రజలు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 13వ వార్డులో నూతన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**– కాలనీవాసుల నెరవేరిన చిరకాల కోరిక.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు మరింత చేరువ**



**పరిగి, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):** పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ గురువారం ప్రారంభించారు. వార్డులోని గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డులోని బిసి కాలనీ, మందుల కాలనీ, ఖాన్ కాలనీకి అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో కాలనీవాసులు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలు పొందేందుకు జాతీయ రహదారి ని దాటి అక్కడ వున్న కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో చిన్నపిల్లలతో పాటు మహిళలు రాకపోకల్లో ఇబ్బందులు పడినట్లు స్థానికులు తెలిపారు.

ప్రస్తుతం ఖాన్ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడం వల్ల మహిళలు, చిన్నారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కేంద్రాన్ని మంజూరు చేసి ప్రారంభించిన కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు బాలామృతం, పౌష్టికాహారం, గుడ్లు, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య లక్ష్మి పథకం కింద పౌష్టికాహార సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల సహకారంతో పిల్లలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, టీకాలు నిర్వహించనున్నట్లు అన్నారు.

మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు వారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. వార్డులోని అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త తోపాటు చెందిన మహిళలు చిన్నారులు కాలనీ చెందిన పలువురు పాల్గొన్నారు.

# ఇసుక తరలింపుపై నవాంద్గిలో నిరసన గళం




**– భూగర్భ జలాలు అడుగంటుతున్నాయంటూ ఆందోళన**
**– తహసీల్దార్ కార్యాలయం ఎదుట సర్పంచ్, గ్రామస్తుల ధర్నా**

**బషీరాబాద్ అక్టోబర్ 1 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి కాగ్న నది నుంచి ఇసుక తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్తులు, యువకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాగ్న నది నుంచి ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుక తరలింపులో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో ఇసుక రీచ్‌కు అనుమతులు ఇవ్వొద్దని గతంలోనే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. అయినప్పటికీ ఇసుక తరలింపు కొనసాగుతోం దని, దీంతో కాగ్న రీచ్ వద్ద ట్రాక్టర్ల రాకపోకలను అడ్డుకుంటూ నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. గ్రామంలో ఇసుక రీచ్‌కు అనుమతులు నిలిపివేసి, భూగర్భ జలాలను కాపాడాలని కోరారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగానే అనుమతులు :**

ఇసుక తరలింపుపై గ్రామస్తులు తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఇసుక అవసరమున్న లబ్ధిదా రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వస్తున్నారని తెలిపారు. కార్యాలయం నుంచి నేరుగా ఇసుకకు అనుమతులు ఇవ్వడం లేదని, ఆన్‌లైన్‌లో వచ్చిన పత్రాలను పరిశీలించి సంబంధిత జీపీఓకు స్కాన్ చేసి పంపుతున్నామని తహసీల్దార్ వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ వేణు నర్సింలు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా స్వచ్ఛత హై సేవా కార్యక్రమం




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** మహాత్మాగాంధీ 157వ జయంతి సందర్భంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో గురువారం 1 అక్టోబర్, 2026న స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం జరిగింది. ఎస్కి స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవల్‌తో పాటుగా కాలేజ్ సిబ్బంది, శిక్షణ కోసం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అభ్యర్థులు, స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు కార్యాలయ ఆవరణలోని చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను, పనికిరాని వస్తువులను తొలగించారు. 2014 అక్టోబర్ 2న భారత ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా 2017న స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాన్ని కూడా ప్రారంభించిన నేపథ్యంలో పౌరులు స్వచ్ఛందంగా ఈకార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ మాట్లాడుతూ.. 2026 స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం నినాదం స్వచ్ఛతలో భాగస్వామ్యమని, స్వచ్ఛ భారత్.. వికసిత భారత్ ను విజయవంతం చేయాలని అన్నారు. ప్రతిరోజూ మన ఇంటిని ఎలా పరిశుభ్రశీగా, వుంచుకుంటామో, మన, పరిసరాల్లో వుండే చెత్త చెదారాన్ని స్వచ్ఛదంగా తొలగించుకుంటే పరిసరాలు ఆహ్లాదంగా వున్నపుడు మనుషులతో పాటుగా అన్ని ప్రాణులు కూడా ఆరోగ్యాంగా వుంటాయని, స్వచ్ఛతా హై సేవ కార్యక్రమం పౌరులు, విద్యార్థులు, ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సిబ్బంది పాల్గొనడానికి ఒక గొప్ప వేదికని, లక్షలాది మంది సమిష్టిగా పాల్గొనడశీ వలన పరిశుభ్రత పెరుగుతుంద న్నారు. వ్యర్థాల తొలగింపు ప్రతి ఒక్కరి బాధ్యతని, శ్రమదానం, స్వచ్చోత్సవ్ తదితర నినాదాలతో ప్రతి ఏటా నిర్వహించుకుంటున్న ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాల వలన ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెరుగుతుందని చెబుతూ, చివరగా స్వచ్ఛత అక్కడున్నవారితో ప్రమాణం చేయిశీచారు. కార్యక్రమ నిర్వహణ పనులను కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి రాజారావులు, డాక్టర్ విక్రమ్ సిన్హా ఏస్పీజీఎస్ సిబ్బంది పర్యవేక్షించారు.

# గంధంగూడలో అనుమతి లేని అక్రమ వెంచర్‌పై జిహెచ్ఎంసి అధికారులు కొరడా





**– జెసిబిలతో అక్రమ వెంచర్ కూల్చివేత**
**– అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు, వెంచర్ చేస్తే కఠిన చర్యలు తప్పవు**
**– రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి**

**రాజేంద్రనగర్, అక్టోబర్ 01 (ప్రజా జ్యోతి) :** అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు, వెంచర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి హెచ్చరించారు.

గ్రేటర్ హైదరాబాద్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గంధం గూడా లో నిబంధనల విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా దాదాపు నాలుగు ఎకరాలలో అక్రమంగా వెంచర్ చేశారని ఫిర్యాదు రావడంతో గురువారం సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు పోలీస్ బందోబస్తుతో జెసిబి లతో అక్రమ విచారణ పూర్తిగా కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో వెంచర్ నిర్వాహకులకు జిహెచ్ఎంసి అధికారులకు మధ్య తీవ్ర వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ దళారులు చెప్పే పర్మిషన్ ఇప్పిస్తామని, అధికారులతో మాట్లాడి పని పూర్తి చేయిస్తామని చెప్పే తలారులను మధ్యవర్తులను మాటలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని సూచించారు.

జిహెచ్ఎంసి అధికారులు దళారుల వ్యవస్థను ఏ మాత్రం సహించదన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షం సౌకర్యం బిల్డ్ నౌ ఇటువంటి ఆన్లైన్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది అన్నారు. ఇల్లు కట్టుకోవాలన్న లేదా ఇతర నిర్మాణాల సేవలు చేపట్టాలన్న ప్రభుత్వం అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్లైన్ ద్వారా లేదా నేరుగా జిహెచ్ఎంసి కార్యాలయానికి వచ్చి అన్ని వివరాలు తెలుసుకొని ఇబ్బందుల ప్రకారం అనుమతులు పొంది తర్వాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేని లేఔట్లను స్థలాలు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. చట్టపరమైన అనుమతులు ఉన్న వాటిలోనే ఎంచుకోవాలని జిహెచ్ఎంసి అధికారులు ప్రజలకు సూచించారు.

# పీర్జాదిగూడలో షాపింగ్ సందడి

**– రష్మి గౌతమ్‌తో మాంగళ్య ఎగ్జిబిషన్ ప్రారంభం**
**– పళని కన్వెన్షన్‌లో మెగా షాపింగ్ జాతర..18 రోజుల పాటు సందడి**
**– ఒకేచోట వేలాది ఉత్పత్తులు..మాంగళ్య ఎగ్జిబిషన్‌కు ఘన శ్రీకారం**
**– రష్మి గౌతమ్ రాకతో కళకళలాడిన మాంగళ్య షాపింగ్ ఎగ్జిబిషన్**




**మేడిపల్లి, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లో ఉన్న పళని కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్ మెగా ఎగ్జిబిషన్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీ నటి,టెలివిజన్ వ్యాఖ్యాత రష్మి గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు నమశివాయతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె వివిధ స్టాల్స్ ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రష్మి గౌతమ్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఒకే వేదికపై నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందించే ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఎగ్జిబిషన్‌లో మహిళలు, యువత, పిల్లలు, కుటుంబ సభ్యుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలు, డిజైనర్ చీరలు, రెడీమేడ్ దుస్తులు తదితర విభాగాలకు చెందిన వందలాది స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక తగ్గింపు ధరలు, పండుగ ఆఫర్లు, ఆకర్షణీయమైన కొనుగోలు పథకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌ను 18 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపార సంస్థలు,ప్రముఖ బ్రాండ్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన షాపింగ్ అనుభూతిని కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు,అభిమానులు, వ్యాపారవేత్తలు, నిర్వాహకులు హాజరయ్యారు. రష్మీ గౌతమ్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపగా ఎగ్జిబిషన్ ప్రాంగణం సందర్శకులతో కిక్కిరిసిపోయింది.

## బలవంతంగా రైతుల వద్ద భూములు తీసుకుంటే ఊరుకునేది లేదు

**– ప్రతి ఎన్నికల్లోను పట్టాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే రైతులను మోసం చేశారు**
**– బహదూర్ గూడ రైతులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది**
**– బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి) :** బలవంతంగా రైతుల వద్ద భూములు తీసుకుంటే ఊరుకునేది లేదని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి కార్తీక్ రెడ్డి హెచ్చరించారు.

శంషాబాద్ లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తిక రెడ్డి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. గత ఎన్నో సంవత్సరాలుగా బహాదుర్ గూడలో రైతులు పంటలు వేసుకునే జీవనం కొనసాగిస్తుంటే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అది ప్రభుత్వ భూమి అంటూ రైతుల వద్ద బలవంతంగా భూములు తీసుకుంటుందని ఉంటుందన్నారు. ప్రభుత్వానికి భూములు అవసరం ఉంటే రైతులను ఒప్పించి, భూమికి భూమి ఇచ్చి, నష్టపరిహారం ఇచ్చి తీసుకోవాలి తప్ప బలవంతంగా తీసుకుంటే బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన తీవ్ర పోరాటం చేస్తుందని హెచ్చరించారు. బహదూర్ గూడ సంబంధించిన రైతులు తమ న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ను కలిస్తే దాన్ని కూడా రాజకీయం చేస్తూ కేటీఆర్ ను కలిసిన వారిలో రైతులే లేరని చెప్పడం దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రకాష్ గౌడ్ ప్రతి ఎన్నికల్లోను తనను గెలిపిస్తే బహదూర్ గూడా రైతులకు పట్టా పాస్ పుస్తకాల ఇప్పిస్తానని, మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారే తప్ప రైతుల పక్షాన ఎన్నడు పోరాడలేదన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు సంవత్సరాలు అధికారంలో ఉంటుంది కాబట్టి రైతుల పక్షాన ముఖ్యమంత్రికి చెప్పి రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇప్పించాలన్నారు. లేకుంటే రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు న్యాయం చేసే బాధ్యత బిఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మోహన్ రావు, శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీలు మురళీధర్ రెడ్డి, చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, నాయకులు దీప మల్లేష్,బుర్కుంట సతీష్,జయసింహ, చెక్కల చంద్రశేఖర్, గౌస్ పాష, రాహుల్, బుచ్చిరెడ్డి,ప్రసాద్ గౌడ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిన్నటి తరం అందించిన విలువలే...

**– నేటి సమాజానికి బలమైన పునాది**
**– బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**




**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1(ప్రజా జ్యోతి) :** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 132 – జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో నిర్వహించిన వయోవృద్ధుల దినోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నిన్నటి తరం అందించిన విలువలే, నేటి సమాజానికి బలమైన పునాదని అన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వయోవృద్ధులకు బహుమతులతో పాటు భారత రాజ్యాంగం, చైతన్య భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నర్సింహా రెడ్డి, పెద్ది మల్లేశం, గోపాల కృష్ణ ఆర్య, నరహరి, మురళీ గౌడ్, లక్ష్మణా చారి, ఎం.నాగేష్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, ఆటో బలరాం, కాలే గణేష్, కుంట వేణు, బాల మల్లేష్, రాజు యాదవ్, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, ఇందిరా రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాం

**జాతీయ వికలాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాదయ్య**



**తాండూరు, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** వికలాంగుల ఆకుల కోసం నిరంతరం పోరాడుతానని జాతీయ వికలాంగుల హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాతరి యాదయ్య చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులను కాపాడటం కోసం వికలాంగుల పక్షాన ఉండి నిరంతరం పోరాడుతానని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు ప్రతి నెల రూ 6000 వేల పెన్షన్ ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచిన కూడ ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. అదేవిధంగా వికలాంగులకు హైదరాబాద్ జిహెచ్ఎంసి తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# రెస్టారెంట్ పై ఆహార భద్రతా శాఖ అధికారుల తనిఖీలు

## కూల్‌డ్రింక్ సీసాలపై తుప్పు.. 60 కేసులు స్వాధీనం

కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 1: (ప్రజాజ్యోతి ): కరీంనగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో ఆహార భద్రతా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 200



మి.లీ. కూల్‌డ్రింక్ గాజు సీసాల మూతల వద్ద తుప్పు గుర్తించారు. అదే ఉత్పత్తికి చెందిన ఇతర సీసాల్లోనూ ఇదే సమస్య కనిపించడంతో, సరఫరా చేస్తున్న పంపిణీ కేంద్రంలో అధికారులు తనిఖీలు చేపట్టారు.

పంపిణీ కేంద్రంలో సీసాల మూతల వద్ద తుప్పు పట్టిన సుమారు 60 కేసుల 200 మి.లీ. గాజు సీసాలను అధికారులు గుర్తించి నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రత, నాణ్యతకు సంబంధించిన అంశాలపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు రెస్టారెంట్‌లో ఆహార భద్రతా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 200 మి.లీ. కూల్‌డ్రింక్ గాజు సీసాల మూతల వ రూపొందించిన నిబంధనల మేరకు చర్యలు ప్రారంభించడంతో పాటు, సంబంధిత కూల్‌డ్రింక్ తయారీదారుకు వివరణ కోరుతూ నోటీసు జారీ చేయనున్నట్లు శాఖ అధికారులు తెలిపారు. తగిన సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించనున్నారు.

ఆహార భద్రతా శాఖ అధికారులుగా చెప్పుకుంటూ ఆహార వ్యాపార నిర్వాహకులు, ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లను ఫోన్‌లో బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్న మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని శాఖ హెచ్చరించింది. ఇటీవల తిమ్మాపూర్‌లోని ఓ ప్రభుత్వ వసతి గృహం వార్డెన్‌కు 7842521329 నంబర్ నుంచి ఫోన్ చేసి, తాను ఆహార భద్రతా శాఖకు చెందిన అధికారినంటూ డబ్బులు డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఆహార వ్యాపార సంస్థలను సందర్శించి తాము శాఖ ఉద్యోగులమని చెప్పుకుంటూ అనుమతి లేకుండా ప్రాంగణాల్లోకి ప్రవేశించడం, ఫొటోలు తీయడం, డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు.ఆహార వ్యాపార నిర్వాహకులు, వసతి గృహాల అధికారులు ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ లేదా వ్యక్తులు ఎదురైతే వెంటనే సంబంధిత ఆహార భద్రతా శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాఖ అధికారులు నిర్దేశిత విధానాల ప్రకారమే తనిఖీలు, అమలు చర్యలు చేపడతారని




స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపార నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి శాఖకు సహకరించాలని కోరారు

# బావిలో పడి మహిళ మృతి

కోరుట్ల, అక్టోబర్ 01 ప్రజాజ్యోతి: మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన గుండె గంగు (75) బావిలో పడి మృతి చెందిన ఘటన కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆమె అక్టోబర్ 1న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం కనిపించింది. కుమారుడు గుండె శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యులకు ఎవరిపైనా అనుమానం లేదని పోలీసులు తెలిపారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జిల్లా కలెక్టర్

మల్యాల,అక్టోబర్ 1,ప్రజా జ్యోతి : కొండగట్టు ఆంజనేయ స్వామిని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు.ఈ



సందర్భంగా దేవస్థానం ఈవో అంజనా రెడ్డి ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టర్ కి స్వాగతం పలికారు. కలెక్టర్ సత్యప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వేదమంత్రోచ్చారణతో ఆశీర్వాదం పలికి కలెక్టర్ కి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి స్వామి వారి శేష వస్త్రంతో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ని సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనా రెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ కుమార్ ప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి ఇన్స్పెక్టర్ అశోక్, ఆలయ సిబ్బంది, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారంలో ఘనంగా సీమంతం కార్యక్రమం

కోరుట్ల రూరల్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి): ధర్మారం గ్రామంలోని అంగన్వాడీ-2 కేంద్రంలో గురువారం గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు స్కూల్ యూనిఫాంలను అందజేశారు.ఈ సందర్భంగా తల్లి, శిశు ఆరోగ్యం, చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను





వివరించారు. గర్భిణీలు, బాలింతలు,చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి, సూపర్‌వైజర్ తేజస్విని, ఉపసర్పంచ్ గణేష్, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తాన్, అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళ బావిలో పడి మృతి

కోరుట్ల రూరల్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి): మోహన్‌రావుపేట గ్రామంలో ఓ మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం మోహనరావ ుపేట గ్రామానికి చెందిన గుండె గంగు (75), భర్త ఎర్రన్న గత నాలుగు నెలలుగా ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఆసుపత్రిలో చికిత్స చేయించినప్పటికీ పూర్తిగా కోలుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె అప్పుడప్పుడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి వచ్చేదని పేర్కొన్నారు. అక్టోబర్ 1న ఉదయం సుమారు 7:40 గంటలకు గుండె గంగు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతుకుతుండగా, ఆమె వ్యవసాయ భూమి వైపు వెళ్లినట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. దీంతో మృతురాలి కుమారుడు గుండె శ్రీనివాస్ (46) పొలానికి వెళ్లి చూడగా, వ్యవసాయ బావిలో గుండె గంగు మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. ఈ ఘటనపై శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతురాలి మరణంపై కుటుంబ సభ్యులకు ఎవరిపైనా అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి

**ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి**




కరీంనగర్ టౌన్,అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి ): ఎన్నికల సంఘం తన రాజ్యాంగ స్వతంత్రతను కాపాడుత స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ , ఫారం-6లో మార్పులు, ఎన్నికల కమిషన్‌లో నమోదైనట్లు వచ్చిన అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.సెప్టెంబర్ 26న భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనతో తలెత్తిన సందేహాలు తొలగలేదని, నిర్ణయాల ప్రక్రియపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సర్ , ఫారం-6, కమిషన్‌లోని అభ్యంతరాలు, నిర్ణయాల ప్రక్రియపై సమగ్ర, స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తలెత్తిన ప్రశ్నల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని అంబటి జోజి రెడ్డి కోరారు.

# రక్తదానం.. ప్రాణదానం!

**జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం**

**ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేస్తున్న ప్రతి రక్తదాతకు హృదయపూర్వక అభినందనలు**

**కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజర్ భాయ్**

కోరుట్ల, అక్టోబర్ 1 ప్రజాజ్యోతి: రక్తదానం అనేది కేవలం ఒక సామాజిక సేవ మాత్రమే కాదని, ఆపదలో ఉన్న మరో మనిషి ప్రాణాలను కాపాడే మహోన్నత మానవతా కార్యమని కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజర్ భాయ్ పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రక్తదాతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

- ఒక యూనిట్ రక్తం.. ఒక ప్రాణానికి ఆశ

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతుంటాయని, అలాంటి సమయంలో స్వచ్ఛంద రక్తదాతలు అందించే రక్తం బాధిత కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని అజర్ భాయ్ అన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు తదితర అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉంటుందని తెలిపారు.

- స్వచ్ఛంద రక్తదాతల సేవలు అభినందనీయం

ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా రక్తదానం చేస్తున్న యువత, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, రక్తదాతల సేవలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. రక్తం తయారు చేయలేని జీవద్రవ్యం కావడంతో అవసరమైన సమయంలో ఒకరి రక్తం మరొకరి ప్రాణాలను నిలబెట్టే అమూల్యమైన సహాయంగా మారుతుందని పేర్కొన్నారు.

- యువత ముందుకు రావాలి

రక్తదానంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అజర్ భాయ్ అన్నారు. ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా సమాజంలో మానవతా విలువలను పెంపొందించవచ్చని తెలిపారు.

- రక్తదానం.. సామాజిక బాధ్యత

కేవలం రక్తదాన దినోత్సవం రోజునే కాకుండా అవసరమైన సందర్భాల్లో స్వచ్ఛందంగా రక్తదానం చేసే సంస్కృతి సమాజంలో మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ప్రాంతంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, అత్యవసర సమయాల్లో రక్తం



అందుబాటులో ఉండేలా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.మన రక్తం.. మరొకరి జీవితానికి వెలుగు. మన చిన్న సహాయం.. ఒక కుటుంబానికి పెద్ద ఆశ. అనే స్ఫూర్తితో అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని అజర్ భాయ్ కోరారు.

- రక్తదాతలకు హృదయపూర్వక అభినందనలు

ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి అండగా నిలుస్తూ, తమ విలువైన రక్తాన్ని స్వచ్ఛందంగా అందిస్తున్న ప్రతి రక్తదాతకు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా అజర్ భాయ్ హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాతల సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# నేరెళ్ల బాధితులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయం

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు ఎల్లవేళలా అండగా ఉంటుంది: కాంపెల్లి శ్రీనివాస్

ముస్తాబాద్, అక్టోబర్ 1(ప్రజా జ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్ అన్నారు. నేరెళ్ల బాధితుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నేరెళ్ల బాధితుల సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ముస్తాబాద్ మండల ఎస్సీల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, వెనుకబడిన వర్గాల



అభ్యున్నతికి కృషి చేస్తుందని కాంపెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకు భూమి అందించేందుకు అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. భూమిలేని పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ముస్తాబాద్ మండల ఎస్సీల తరఫున మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంపెల్లి శ్రీనివాస్ అన్నారు.

# స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో సామూహిక శ్రమదానం

## "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్"లో భాగంగా రహదారుల శుభ్రత కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్ రమాదేవి సంపత్.

ఎలిగేడు , అక్టోబర్ 01(ప్రజా జ్యోతి): ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "స్వచ్ఛతా హి సేవా-2026" కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 1న "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" నినాదంతో సామూహిక శ్రమదానం కార్యక్రమాన్ని ర్యాకల్ దేవ్ పల్లి



గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. రహదారులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలుగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొని సామూహికంగా శ్రమదానం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్ , వార్డు సభ్యులు, గుడి కందుల చంద్రకళ నరేష్, అంగన్వాడి టీచర్ ఓదీశ్వరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

## సర్ ప్రక్రియను నిలిపేయాలి.. సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి ): కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, తొలగించిన ఓటర్లలో అర్హులైన వారిని వెంటనే చేర్చాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి డిమాండ్ చేశారు. గురువారం రోజున రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం,సిపిఐ పార్టీల నాయకులు స్థానిక గీతా భవన్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి, కేదారిలు మాట్లాడుతూ ఓట్ల దొంగ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకుంటే ఈ ఉద్యమం ఇక్కడితో ఆగబోదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపే ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు.. జ్ఞానేష్ కుమార్ సీఈసీగా కాకుండా బీజేపీకి, ప్రధాని మోడీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్ ప్రక్రియ వల్ల రాష్ట్రాల్లో ప్రభుత్వాలే మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ లో బీజేపీకి వ్యతిరేకంగా ఉండే 37 లక్షల ఓట్లు తొలగించారన్నారు. దాంతో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. తమిళనాడులో డీఎంకే ఓడిపోయిందని అన్నారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగితే బీజేపీ ఓడిపోయే పరిస్థితి ఉందన్నారు. అందుకే బీజేపీ వ్యతిరేక ఓట్లను సుమారు 13 కోట్ల పైచిలుకు ఓట్లు ఈసి తొలగించిందని విమర్శించారు. బీజేపీ మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు ఈసి ద్వారా ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, అయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయడం ప్రజల డిమాండ్ అన్నారు. రాజ్యాంగం ప్రకారం ఈసిని నడపాలి కానీ ఆయన నిబంధనలను తుంగలో తొక్కారని అన్నారు. ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలమని చెప్పారు. జ్ఞానేష్ కుమార్ ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోయేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసి పారదర్శకంగా సర్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. కానీ అర్హులైన వారి ఓట్లను తొలగిస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తీసేయడం సరైంది కాదన్నారు. అర్హులైన ఓట్లను కేంద్రం, ఈసి తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారి ఓట్లను తొలగించి అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బీజేపీ భావిస్తున్నదని విమర్శించారు. బీజేపీకి ఈసి ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. సర్ పేరుతో జ్ఞానేష్ కుమార్ ఓట్లను తొలగిస్తుంటే ప్రధాని మోడీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల ఓట్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. రాబోయే కాలంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించేంతవరకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, అభ్యుదయవాదులు ఐక్య పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడి కందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునుటి శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, కోనేటి నాగమణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బి యుగేందర్, సిపిఐ నాయకులు బాకం ఆంజనేయులు, రమేష్, పి బాపురెడ్డి, జువ్వాజి తిరుపతి, సిపిఎం నాయకులు రాయి కంటి శ్రీనివాస్, గజ్జల శ్రీకాంత్, కే అరవింద్, బోగేష్, ఇసాక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఎస్జీఎఫ్ హ్యాండ్‌బాల్‌లో సత్తా చాటిన కోరా విద్యార్థులు

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 1( ప్రజాజ్యోతి ): సెప్టెంబర్ 29 కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కోరా ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో జె.బంధన్, అండర్ -17 ఇ.పుజిత, ఎన్.మునిషా అత్యుత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ మహిపాల్




రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రామ్ రెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి గార్లు అభినందించి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులును యాజమాన్యం అభినందించింది. ఈ విజయం పట్ల కోరా ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చెసారు.

# దశరదా పెద్ద రాములు దశదిన కర్మలో పాల్గొన్న భూక్యా సురేష్ నాయక్



ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి: మండల పరిధిలోని చిమ్మపూడి గ్రామానికి చెందిన దశరదా పెద్ద రాములు దశదిన కర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద రాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి దేవయ్యాచారి, బానోత్ శివ తదితరులు పాల్గొన్నారు.

# మా అభ్యాసం మా గర్వం.. మా ప్రతిభ మా భవిష్యత్తు

– నారాయణ స్కూల్ ఘనంగా ప్రైమరీ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్





సత్తుపల్లి అక్టోబర్01(ప్రజా జ్యోతి) పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డు లో గల నారాయణ స్కూల్ నందు 1వ ,2వ తరగతి విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులే వక్తలుగా, తల్లిదండ్రులే ప్రేక్షకులుగా పాల్గొని, విద్యార్థులు తమ ప్రతిభను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించి, వివిధ కార్యకలాపాలు మరియు ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల చురుకుదనం, ఆత్మవిశ్వాసం, మాట్లాడే తీరు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఏజీఎం రాంకీ హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి, చిన్నారులను అభినందించారు. అలాగే ఆర్ ఐ క్రాంతి , కోఆర్డినేటర్ వినోద లక్ష్మి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను వ్యక్తపరచే అవకాశాలను కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి వంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

# సందర్భంగా డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరం




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్వరమ్మ ప్రశాంతి సదన్ మహిళా వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు.డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి పి. దేవి మానస పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించి, వృద్ధులకు ఆరోగ్యంపై అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ సీనియర్ సిటిజన్స్ పథకం 2016 అలాగే తల్లిదండ్రులు మరియు వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007 పై డి ఎల్ ఎస్ ఏ ద్వారా అవగాహన కల్పించారు.వృద్ధులకు అందుబాటులో ఉన్నా ఉచిత న్యాయ సహాయం,హక్కులు,చట్టపరమైన రక్షణ తదితర అంశాలను వివరించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ వైద్యశాఖ అధికారి డా. బి. వేణుమాధవ్ రావు మెడికల్ ఆఫీసర్ డా. ఎన్. కృష్ణ చైతన్య, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా డి ఎల్ ఎస్ ఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్వరమ్మ ప్రశాంతి సదన్ మహిళా వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి పి. దేవి మానస పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించి, వృద్ధులకు ఆరోగ్యంపై అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ సీనియర్ సిటిజన్స్ పథకం 2016 అలాగే తల్లిదండ్రులు,వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం2007 పై డి ఎల్ ఎస్ ఏ ద్వారా అవగాహన కల్పించారు.వృద్ధులకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, వారి హక్కులు, చట్టపరమైన రక్షణ తదితర అంశాలను వివరించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ వైద్య శాఖ అధికారి డా. బి. వేణుమాధవ్ రావు,మెడికల్ ఆఫీసర్ డా. ఎన్. కృష్ణ చైతన్య,కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏ ఎన్ ఎం లు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది

- కోట్లాది విలువైన ఇసుక అక్రమ తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- వెంటనే ఆన్ లైన్ నిలిపివేయాలని డిమాండ్
- ఇసుక అక్రమాల వెనుక అధికార పార్టీ హస్తం
- రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలి
- లేదంటే ఆందోళన చేపట్టుతాం
- తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 1, ప్రజాజ్యోతి...మణుగూరు మండల కేంద్రంలో ఇసుక అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, వెంటనే ఇసుక ఆన్ లైన్ ప్రక్రియను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి డిమాండ్ చేశారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. పద్మగూడెం, బాపనకుంట, శివాజీనగర్ గ్రామాల పరిధిలో ఇసుక సొసైటీల ముసుగులో మైదాన ప్రాంత వాసులు, ఆంధ్రాకు చెందిన భీమవరం వ్యక్తులు రాజేష్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో భారీగా ఇసుక దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. 1/70 చట్టం, అసైన్మెంట్, పీఓటీ , వాల్టా, నాలా కన్వర్షన్ నిబంధనలను తుంగలో తొక్కి ఇసుక డంపింగ్ చేస్తూ కోట్లాది రూపాయల సహజ వనరులను దోచుకుపోతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాల వెనుక అధికార పార్టీకి చెందిన వ్యక్తులు, కొందరు ప్రభుత్వ అధికారుల హస్తం ఉందని అలెం కోటి సంచలన ఆరోపణ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపి ఆదివాసీల సహజ వనరులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఇసుక రవాణా జరగకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.



# విజయయంతంగా ముగిసిన ఏఐకె ఎం ఎస్ అఖిల భారత మహాసభ



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఏఐకేఎంఎస్ మహాసభ ముగిసింది. పోరాటపటిమ గల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిస్తూ, గత బృందంతో కొత్త నాయకులు నాయకత్వం వహించనున్నారు.ఫాసిస్ట్ దాడులు, కార్పొరేట్ దోపిడీ, భూస్వాముల అణచివేతను తిప్పికొట్టడానికి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంఘటితం కావాలని రైతులను ప్రేరేపించాలని కొత్త అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కార్యకర్తలకు పిలుపునిచ్చారు; జీవనాధార భూమి, అడవులు,నదులను కాపాడటానికి బలమైన ఉద్యమాలను నిర్మించాలి.ఎరుపు రంగు నేపథ్యంలో ఆకుపచ్చ గీత,నాగలి, కొడవలితో కూడిన కొత్త జెండాను 4వ మహాసభ ఏఐకేఎంఎస్ మహాసభఆమోదించింది.అనేక రైతు సమస్యలు, నీటి సంక్షోభం తీవ్రత,అప్రజాస్వామిక చట్టాల రద్దు,సీఈసీ జ్ఞానేస్ కుమార్కి శిక్షించాలని తీర్మానాలు ఆమోదించింది.ఏఐకేఎంఎస్ 4వ మహాసభ నిన్న రాత్రి సుమారు 8.30 గంటలకు కామ్రేడ్ అజ్మీర్ సింగ్ హాల్ (ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్, ఖమ్మం)లో ముగిసింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కామ్రేడ్ నిర్భయ్ సింగ్ దుడికే, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జె.వి. చలపతి రావు తమ భుజాలపై మోపబడిన బాధ్యతలను వినయంగా స్వీకరిస్తూ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.గ్రామీణ భారతదేశ దోపిడీకి సంబంధించిన మూల సమస్యల పట్ల తమను తాము పునఃసమీక్షించుకోవాలని అగ్రగామి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే, తమ పనితీరును మార్చుకుని,జీవనాధార భూమి,అడవులు,నదులను కాపాడటానికి బలమైన, పోరాటపటిమ గల ఉద్యమాలను నిర్మించేందుకు భూమిలేనివారు, వ్యవసాయ కార్మికులు, చిన్న, మధ్యతరహా రైతులను సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు.ఆర్ఎస్ఎస్–బీజేపీ, ఇతర డబుల్ ఇంజన్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులపై చేస్తున్న ఫాసిస్టు దాడులను ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా మాత్రమే తిప్పికొట్టగలమని అన్నారు.వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, ఆహార శుద్ధి, నిల్వ, మార్కెటింగ్ రంగాల నుండి అన్ని కార్పొరేషన్లు, దేశ, విదేశీ బహుళజాతి, కార్పొరేట్ సంస్థలను నిషేధించాలనే తమ డిమాండ్ను వారు నొక్కి చెప్పారు. ఈ నూతన సామ్రాజ్యవాద ధోరణి, రైతులపై భూస్వాముల దాడులను మరింతగా ప్రోత్సహించిందని, తెలంగాణ, నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయల రైతుల పోరాటాల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు.రైతుల పోరాటానికి ఐక్య సంస్థగా ఎస్కేఎం అభివృద్ధిని ప్రశంసిస్తూ, వరి ధాన్యానికి కేవలం 3 శాతం,గోధుమలకు ఒక శాతం కంటే తక్కువ మాత్రమే ధర పెంచడాన్ని తీవ్రంగా విమర్శించారు. అంతకుముందు జరిగిన సమావేశం, కామ్రేడ్సుఆశిష్ మిట్టల్, సుధాకర్లను ఉపాధ్యక్షులుగానూ, కామ్రేడ్లు బాలచంద్ర, రమీందర్ సింగ్లను కార్యదర్శులుగానూ, కామ్రేడ్ చిట్టిపాలొ వెంకటేశ్వర్లుని కోశాధికారిగా, కామ్రేడ్స్ వి. వెంకట్రామయ్య, గొనీ ఐలయ్య, సుశాంతో ఝా, దేబాజిత్ చౌదరి, శంభు ప్రసాద్, ధరంపాల్ సింగ్, జెడ్.పి.ఎస్.సి. నుండి కామ్రేడ్ ముఖేష్ మలౌత్లను సభ్యులుగా కలిగిన 15 మంది సభ్యుల కేంద్ర కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకుంది. వ్యవసాయ పోరాటాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సమావేశం తన జెండాను మార్చడం ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చింది. ఆమోదించిన కొత్త జెండాలో ఎడమవైపున ఆకుపచ్చ పట్టీపై నిలువుగా ఏఐకేఎంఎస్ చిహ్నం,వెడల్పాటి ఎర్రటి ఆధారంపై రైతులు, వ్యవసాయ కార్మికుల సాంప్రదాయ చిహ్నాలైన నాగలి,కొడవలి ఉన్నాయి. కార్పొరేషన్ల దాడులు తీవ్రతరం అవుతున్న కొద్దీ, పోరాటాలలో భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగ భాగస్వామ్యం పెరగడం ఖాయమనీ, పోరాటంలో ఇరు వర్గాల ఐక్యతకు జెండా ప్రతీకగా నిలవాలనే వాస్తవాన్ని గుర్తించి ఈ జెండాను రూపొందించారు.ఈ సమావేశం 17 తీర్మానాలను పరిశీలించి, రాబోయే పోరాటాలకు మార్గనిర్దేశం చేసేందుకు వాటిని ప్రత్యేక అంశాలుగా అమోదించింది.వీటిలో పెద్ద ఆనకట్టలకు వ్యతిరేకత; కరువు, వరదల శాస్త్రీయ నిర్వహణకు మద్దతు; కెన్ బెట్వా నదుల అనుసంధానానికి వ్యతిరేకత; రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ సమస్యను పరిష్కరించడం, నదీతీర ప్రాంతాల సూత్రాన్ని అమలు చేయడం,వ్యవసాయ–వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల సరళిని మార్చడం; స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ( ఎఫ్ ఏ టి ఎస్ ), ముఖ్యంగా అమెరికాతో ఒప్పందాన్ని వ్యతిరేకించడం; ఈ–20 పెట్రోల్ కోసం ఆహార ధాన్యాల నుండి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడాన్ని వ్యతిరేకించడం; కొనుగోలుకు హామీ ఇస్తూ సి2o50% వద్ద కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) అమలు; వ్యవసాయ కార్మికులతో సహా రైతులందరికీ రుణమాఫీ, ఆత్మహత్యలను ఆపడం; పేదరికాన్ని తగ్గించామన్న ప్రభుత్వ తప్పుడు వాదనలను ఖండించడం; గల్ఫ్, ఇరాన్, గాజా, లెబనాన్, సిరియాలపై సామ్రాజ్యవాద యుద్ధాలనూ, ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్నీ ఖండించడం; పెరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా,యు ఏ పి ఏ ,ఎన్ ఎస్ ఏ వంటి నల్ల చట్టాలను రద్దు చేయడం, వాటి కింద నిర్బంధంలో ఉన్న ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయడం,భూ గరిష్ఠ పరిమితిని తగ్గించి,పేదలకు భూమిని పంపిణీ చేయడం వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించడం వంటివి ఉన్నాయి. కార్పొరేట్ జోక్యం,ఆధిపత్యాలకు వ్యతిరేకంగా బలవంతపు నిర్వాసితానికి వ్యతిరేకంగా అటవీ హక్కుల అమలు కోసం, ఈ చట్టాల కింద గ్రామ సభల అధికారాలను నిరాకరించే ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా, ఎం ఎం డి ఆర్ చట్టానికి సవరణలకు వ్యతిరేకంగా; అలాగే, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగించి అరెస్టు కోసం చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానాలు చేసింది.సుమారు 100 మంది వాలంటీర్లు రోజుల తరబడి చేసిన కృషిని అభినందిస్తూ ప్రతినిధులందరూ గట్టిగా చప్పట్లు కొట్టి వారిని వేదికపైకి ఆహ్వానించడం, ఆ తర్వాత అరుణోదయ బృందం 'కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్' గీతాన్ని ఆలపించడంతో ఈ మహాసభ ముగిసింది ఈ విలేకరుల సమావేశంలో జాతీయ డుడికె నిర్భయ సింగ్,జాతీయ ప్రధాన కార్యదర్శి జేవీ చలపతిరావు జాతీయో ఉపాధ్యక్షులు టి సుధాకర్ ఆశిష్ మిట్టల్, జాతీయ కార్యదర్శి రవీందర్ సింగ్ పాటియాల, జాతీయ కార్యవర్గ సభ్యులు వి వెంకట్రామయ్య, గోని ఐలయ్య, తదితరులు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# రూ. 200 కోట్లతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు..

– రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి – ఏదులాపురం మున్సిపాలిటీలో టీజీఎన్ పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనం ప్రారంభోత్సవం

– గృహజ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ వర్తించినట్లు వెల్లడి





ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి: పాలేరు నియోజకవర్గంలో, ప్రత్యేకంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి రూ.205 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తరుణీ హట్ ప్రాంగణంలో టి జి ఎన్ పి డి సి ఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్తు రెవెన్యూ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

**గృహ జ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ**

వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొరకు 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 632 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయించామని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో నాలుగు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. పాలేరు నియోజకవర్గంలో గత రెండేళ్లలో గృహ జ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ వర్తించినట్లు తెలిపారు. మోడల్ సోలార్ గ్రామం పథకం లో భాగంగా.. నేలకొండపల్లిలోని చెరువు మాదారంలో 1,350 మంది గృహ వినియోగదారులకు రూ. 15.66 కోట్ల వ్యయంతో 2,709 కే డబ్ల్యూ సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకల పనులు పురోగతిలో ఉన్నాయని, అలాగే రైతుల కోసం రూ. 31.08 కోట్లతో సౌర విద్యుత్ సౌకర్య పనులు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర విద్యుత్ పునరుద్ధరణ కోసం విద్యుత్ అంబులెన్స్(ఈఆర్టీ వాహనం)ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో..: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, టీజీఎన్ పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు, ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ శ్రీనివాస చారి, డీఈ నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసంలో గర్భిణులకు సీమంతం



చర్ల, అక్టోబర్ 01:(ప్రజా జ్యోతి): పోషణ మాసంలో భాగంగా చర్ల మండలంలోని సుబ్బంపేట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం గర్భిణులు, కిశోర బాలికలు, తల్లులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా సీమంత కార్యక్రమాన్ని నిర్వహించి, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తూ వాటితో తయారు చేసిన వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. జొన్న లడ్డూ, సున్నుండలు, సామల పాయసం, రాగి పకోడీ, సజ్జల పులిహోర, శెనగల గుగ్గిళ్లు, చియ్యం--బెల్లంతో చలిమిడి తదితర పౌష్టిక వంటకాలను తయారు చేశారు. చిరుధాన్యాలతో తయారు చేసే ఆహార పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, వాటి తయారీ విధానాన్ని అంగన్వాడీ టీచర్లు తల్లులకు వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీఓ కె. రేవతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాక సత్యనారాయణ, సూపర్వైజర్ స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి జిల్లారపు సర్వేశ్వరరావు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పర్శిక నాగరాజు, ఆశా కార్యకర్త కాక సమ్మక్క, అంగన్వాడీ టీచర్లు వెంకటరమణ, వాడపల్లి త్రిదేవి, ఇర్ప పుష్పవతి, సోడి సుగుణ, రమ్య, ప్రమీల రాణి, ఉషారాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## క్లినికల్ శిక్షణ కొరకు

# అక్టోబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు

ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి ఇంటర్మీడియట్ ఎం.ఎల్.టి.ఒకేషనల్ కోర్సులో మార్చి 2024 సంవత్సరం నుండి ఉత్తీర్ణులైన విద్యార్థిని,విద్యార్థులకు క్లినికల్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి సమీకృత జిల్లా కలెక్టర్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అక్టోబర్ 15లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డీజీపీ సీవీ ఆనంద్‌ను సన్మానించిన టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు




కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / అక్టోబర్ 01,(ప్రజాజ్యోతి) పాల్వంచలో ఇటీవల శ్యామల గోపాలన్ ఏఐటీఏ 2026 టెన్నిస్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన డీజీపీ సీవీ ఆనంద్‌ను కొత్తగూడెం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా జిల్లా టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై వెంకటేశ్వర్లు (వై వి) ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్‌కు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్యామల గోపాలన్ ఏఐటీఏ 2026 టోర్నమెంట్ జ్ఞాపికను అందజేశారు. టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా రావడానికి అంగీకరించి, ఆహ్వానాన్ని స్వీకరించిన డీజీపీ సీవీ ఆనంద్‌కు అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆకులవాడలో కలకలం..

## కూతురు మృతి, తల్లికి తీవ్ర గాయాలు..

### ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు..

పరకాల, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి): పరకాల పట్టణంలోని ఆకులవాడలో గురువారం అనుమానాస్పద ఘటన చోటుచేసుకుంది. కోడెల సుగుణక్క (63) అనుమానాస్పద




పరిస్థితుల్లో మృతి చెందగా, ఆమె తల్లి కోడెల లక్ష్మమ్మ (85) తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఘటనను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సుగుణక్క మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# ఇది " హైవే " అవినీతి

★ జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో కొరవడిన నిఘా

★ అడుగడుగునా నాసిరకం పనుల తో నేషనల్ హైవే విస్తరణ

★ హైవే నాణ్యత నవ్వుల పాలు

★ కోట్లాది రూపాయల నిధులు నేలపాలు

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :




సంగారెడ్డి జిల్లా పరిధిలో జరుగుతున్న 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది నిజమే అన్నట్టుగా అడుగడుగునా నాసిరకం మెటీరియల్ తో హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నా యి. కిలోమీటర్ల పొడవునా జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిద్ర నటిస్తుండడంతో పనులు పొందిన బడా కాంట్రాక్టు సంస్థలు పనులను ముక్కలుగా విభజించి సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతోనే రహదారి నిర్మాణం పనులు నాణ్యత లోపంగా జరుగుతున్నట్టు తెలుస్తున్నది.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

హైదారాబాద్, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు. అదేదో ఇక్కడనే మైక్ ముందు ఒర్లితే అయిపోతుండేనన్నారు. రేవంత్ రెడ్డి అక్కడికిపోయి ఏదో దండయాత్రకు పోయినట్టు.. ఒక ముఖ్యమంత్రి, ఒక పీసీసీ ప్రెసిడెంట్, ఆరుగురు మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు.. ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయారు.. మళ్లీ పేరేమో నల్లమల పులి.. ఎక్కడన్నా నల్లమల పులి 4000 పోలీసులను పెట్టుకోని పోతడా.. అంతమందిని కాపాలా పెట్టుకోని పోయిటోడివి.. నువ్వు పులివా.. నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లి నువ్వు.. అని చురకలంటించారు. రేవంత్ రెడ్డి మొత్తుకునుడు అంతా.. నేను 2009లో రాసిన అఫిడవిట్‌లో నేను రాసిన దాని గురించే నీకు హోటల్ ఉన్నదని చెబుతున్నడు. నేనే చెప్పిన కదా ఉన్నదని.. నువ్వు చెప్పుడేందన్నారు కేటీఆర్. రేవంత్ రెడ్డి పెద్ద కొలంబస్ లెక్క.. వాస్కోడిగామా కదా ఏదో కనుక్కున్నట్టు నువ్వేం కనిపెడితివి కొత్తగా.. అఫిడవిట్‌లో ఉన్నదే నువ్వు చెప్తున్నవ్.. మరి వ్యాపారం చేసుకునుడు తప్పా.. నా భార్య పిల్లలకు కూడా నేను బువ్వ పెట్టాలి కదా.. లేకపోతే వాళ్లు నువ్వు రాజకీయంలా ఏం చేస్తున్నవ్ అని అడుగుతరు.. వాళ్లకు బువ్వ పెట్టనీకి నేను వ్యాపారం బరాబర్ చేస్తా తప్పేందన్నారు కేటీఆర్. నిజంగా నేను వ్యాపారాన్ని పట్టించుకుంటే నేను ఈ రాజకీయం విడిచిపెట్టి ఓ 10 హోటళ్లు చేస్తుండే ఇప్పటికి.. ఇప్పుడు మూడే హోటళ్లున్నాయి.

## అక్టోబర్ 4న తెలంగాణలో

# అమిత్ షా పర్యటన



మొదటిపేజీ తరువాయి..

గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేస్తున్నారు. దీంతో, అమిత్ షా పర్యటన పైన రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

## ఫారం-6లో మార్పులకు

# ఎవరు ఆదేశించారు?



మొదటిపేజీ తరువాయి..

ఆన్‌లైన్ 'ఫారం 6' చట్టవిరుద్ధంగా మార్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని స్వయంగా ఎన్నికల సంఘంలో కమిషనర్లే అభ్యంతరంగా నమోదు చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఆ మార్పులు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారని ఆయన ప్రశ్నించారు. టీసీఎస్ లో ఎవరు దీనికి ఆమోదం తెలిపారని కూడా అడిగారు. అలాగే, అలా చేయడానికి వారిపై ఒత్తిడి తీసుకువచ్చారా అని కూడా రాహుల్ గాంధీ వరుసగా ప్రశ్నలు సంధించారు. దీంతో టీసీఎస్ కూడా ఈ వ్యవహారంలో జవాబు చెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా ఈసీ నుంచి తమకు వచ్చిన ఆదేశాలు, వాటి అమలుకు సంస్థలో ఎవరు ఆమోదం తెలిపారన్న అంశాల్ని ఇప్పుడు టీసీఎస్ బయటపెడుతుందా లేక ఈసీపైనే నెపం వేసి తప్పించుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఈ సర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కిందికే వస్తుందని ఆరోపించారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని, మోదీ- షా ద్వయంపై దర్యాప్తు జరగాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటక బెళగావిలో ఓటర్ల పేర్ల తొలగింపు కుట్రకు సంబంధించి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో కేవలం 3 రోజుల్లోనే బెళగావిలో సుమారు 15 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ప్రయత్నం జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనికి సంబంధించి వేలాది ఫారం- 7 దరఖాస్తులు వెల్లువెత్తాయని, ఎక్కువగా బీజేపీని వ్యతిరేకించే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని గతంలో చేసిన ఆరోపణల్ని రాహుల్ మరోసారి ప్రస్తావించారు. కర్ణాటక కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నారని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సర్ ప్రక్రియపై బుధవారం రోజు ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన 19 రాజకీయ పార్టీల నేతలు సుదీర్ఘంగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2-8 మధ్య జిల్లాల స్థాయిలో సేవ్ డెమోక్రసీ మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయించింది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలంతా కలిసి కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితా సవరణపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయాలని కూటమి నిర్ణయించింది. రాబోయే ఎన్నికలన్నింటినీ ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలనే డిమాండ్‌ను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. సర్ ప్రక్రియకు సంబంధించి సుప్రీం కోర్టులో ఉన్న కేసుల్ని వేగవంతం చేయాలని కూడా ఈ సందర్భంగా కోరుతోంది.

## ఓటర్లకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా ఎస్ఐఆర్- 2026 ప్రక్రియ చేపట్టాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధి కారి సి. సుదర్శన్ రెడ్డి

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)

భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అ నుగుణంగా ఎస్ఐఆర్- 20 26 ప్రక్రియను ఓటర్లకు ఎ లాంటి అసౌకర్యం కలగకుం డా పారదర్శకంగా నిర్వహిం చాలని తెలంగాణ రాష్ట్ర ప్ర ధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు.గురువారం ఎస్ఐఆర్-2026, గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ ఓటరు న మోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సీ ఈఓ




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించా రు. ఆదిలాబాద్ జిల్లా కలెక్ట రేట్ నుంచి జిల్లా కలెక్టర్ రా జర్షి షా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల ను నోటీసులు స్వీకరించేం దుకు లేదా అవసరమైన ప త్రాలు సమర్పించేందుకు కార్యాలయాలకు పిలవరా దని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయ డంతో పాటు, అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీక రించాలి అని సూచించారు. సాధారణంగా ఓటర్లను వి చారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవ రా దని, తప్పనిసరి పరిస్థితు ల్లో విచారణ నిర్వహించా ల్సివస్తే ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించాలని తెలిపా రు. ఈ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు.కొత్త ఓటరు నమో దు కోసం ఫారం-6 సమర్పిం చే సమయంలో డిక్లరేషన్ త ప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ తెలిపారు. ఎస్ ఐ ఆ ర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపో యినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సంద ర్భంగా డిక్లరేషన్ తప్పనిస రిగా ఉండాలని స్పష్టం చేశా రు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సం ఖ్య, పరిష్కరిం చిన దరఖా స్తుల వివరాలను ప్రదర్శిం చాలని సూచించారు. ఓట ర్లకు జారీ చేయాల్సిన పెం డింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసా గించాల ని ఆదేశించారు. అలాగే ఫా రం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబం ధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీ ల ప్రతినిధులకు ఎప్పటిక ప్పుడు అందించాలని సీ ఈ ఓ సూచించారు. గ్రాడ్యు యే ట్ ఎమ్మెల్సీ ఓటరు నమో దును భారత ఎన్నికల సం ఘం మార్గదర్శకాలకు అను గుణంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. సం బంధిత గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ నియోజకవ ర్గానికి చెంది న అర్హత కలిగిన వ్యక్తులు 31.10.2023 నాటికి గ్రా డ్యుయేషన్ పూర్తి చేసి ఉం టే ఓటరుగా నమోదు చేసు కునే అర్హత కలిగి ఉంటారని తెలిపారు.అయితే ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట రు నమోదు ప్రక్రియకు 01.1 1.2026ను అర్హత తేదీగా ప రిగణించాలని సీఈఓస్పష్టం చేశారు. గతంలో గ్రాడ్యుయే ట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట రుగా నమోదైన వారు కూ డా ప్రస్తుత నమోదు ప్రక్రియ లో మరోసారి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూ చించారు. ఓటరు నమోదు కు సమర్పించే మార్కుల మె మో జిరాక్స్ ప్రతిని గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సమర్పించేలా చర్యలు తీ సుకోవాలని తెలిపారు. ఎస్ ఐఆర్-2026 ప్రక్రియలో భా రత ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను క్షేత్రస్థాయిలో క చ్చితంగా అమలు చేయా ల ని సీఈఓ సూచించారు. ప్ర తి దశలో పారదర్శకత పాటి స్తూ, ఓటర్లకు ఎలాంటి ఇ బ్బందులు కలగకుండా అధి కారులు సమన్వయంతో ప నిచేయాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రా వు, పర్యవేక్షకురాలు నలం ద ప్రియ, సంబంధిత అధి కారులు తదితరులు పాల్గొ న్నారు.

## యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

మొదటిపేజీ తరువాయి..

ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే..

**లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు**
**సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక**
**నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు**
**శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ**
**సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 01(ప్రజాజ్యోతి): ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్ధమయ్యారు. రేనేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్ధమవుతోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి. వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు. మరోవైపు శివాజీ పార్క్ వద్ద రేపటి కాక్రోచ్ ల ఆందోళనలకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. స్థానికుల ఆందోళనలను ఇందుకు సాకుగా చూపింది. దీనిపై స్పందించిన దిప్కే.. తాము ఎట్టి పరిస్థితుల్లో జైల్ భరోకు దిగుతామని, చేతనైతే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

# రిమ్స్ ప్రగతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)

రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగు పరచడంతో పాటు నిర్వహ ణలో లోపాలను పూర్తిగా స రిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తంగా విధు లు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠి న చర్యలు తప్పవని హెచ్చ రించారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో అధికారు లు, ఔట్‌సోర్సింగ్‌ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమా వేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సి బ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్య లు తీసుకుంటు న్నామని, వేతనాల్లో అనధికారిక కోత లు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించి న విధులను వదిలి ఇతర ప నులకు వెళ్లే సిబ్బందిని ఉపే క్షించబోమన్నారు. సానిటేష న్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరత ను అధిగ మించేందుకు అవ సరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు. రి మ్స్‌లోకి అనధికారిక ప్రవే శాలను అరికట్టేందుకు గతం లో అమల్లో ఉన్న పాస్ వి ధానాన్ని వెంటనే పునరుద్ధ రించాలని కలెక్టర్ ఆదేశించా రు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు లేదా ఇద్దరు సహాయకు లకు మాత్రమే అనుమతి ఉండే లా గేటు వద్దే నియంత్రణ చే పట్టాలని సూచించారు. ని బంధనలకు విరుద్ధంగా గుం పులుగా ఆసుపత్రిలోకి ప్రవే శించకుండా సెక్యూరిటీ సి బ్బంది కఠినంగా వ్యవహరిం చాలన్నారు. రిమ్స్ ప్రాంగ ణంలో



గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లా స్టిక్, వ్యర్థాలను ఎక్కడపడి తే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బం దిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అ ధికారులు, సూపర్‌వైజర్లు త మ పరిధిలో నిరంతరం ప ర్యవేక్షణ చేపట్టాలని ఆదే శించారు.రిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రి జిస్టర్‌లో ఉన్న 420 మంది లో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నార ని కలెక్టర్ పేర్కొన్నారు. మిగి లిన 70 మంది హాజరు కాక పోవడంపై అసంతృప్తి వ్య క్తం చేశారు. ఆన్‌లైన్ హాజ రు వ్యవస్థలో ఉన్న సాంకేతి క సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించా రు. నవంబర్ నుంచి ఆన్‌లై న్ హాజరు ఆధారంగానే వే తనాలు విడుదల చేయను న్నట్లు స్పష్టం చేశారు. ప్రభు త్వం మంజూరు చేసిన రూ. 11 కోట్ల నిధులతో రిమ్స్‌లో లిఫ్టులు, ట్రాన్స్‌ఫార్మర్ల మర మ్మతు పనులను త్వరితగ తిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

వీల్‌చైర్లు, హెచ్ డీ ఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురా వాలని సూచించారు.

ఆసు పత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్‌యార్డుకు తరలించేం దుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పా టు చేయనున్నట్లు వెల్లడిం చారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ లు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈ ఎస్ఐ బకాయిలను డిసెం బర్ 3లోగా పూర్తిగా చెల్లిం చాలని ఆదేశించారు. రోగు లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సె క్యూరిటీ సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని సూ చించారు.అంతకుముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఔ ట్‌సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్య లు, ఇతర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. స మావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజే శ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధ న, డీపీఓ రమేష్, మున్సిప ల్ కమిషనర్ జగదీశ్వర్ గౌ డ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతి నిధులు, యూనియన్ నా యకులు తదితరులు పా ల్గొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967